www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 236, ఆదివారం 27-9-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

**నాటు పడవల్లో పరిమితికి మించి ప్రయాణం.. పొంచి ఉన్న ప్రమాదం!**



7 లో..

**మున్సిపల్ షాపుల మాటున అక్రమ దందా!**



5వ పేజీల్లో

## చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



- వీరనారికి సీఎం ఘన నివాళులు
- ఆత్మగౌరవ పోరాట యోధురాలి స్మరణ
- అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం
- తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :**

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆమెకు ఘన నివాళులు అర్పించారు. దొరల పాలనను ధిక్కరించి, వెట్టి చాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మహనీయురాలిగా చాకలి ఐలమ్మను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ఆమె త్యాగాలు, పోరాట స్ఫూర్తి తెలంగాణ సమాజానికి చిరస్థాయిగా మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అణగారిన వర్గాల హక్కుల కోసం

మిగతా 2 లో..

## పూరిగుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం



- ప్రతి అర్హ కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇల్లు
- మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్ల మంజూరు
- పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయమన్న పొంగులేటి
- జనగామలో 500 మందికి మంజూరు పత్రాల పంపిణీ

**జనగామ, సెప్టెంబర్ 26**

రాష్ట్రంలో పూరిగుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

మిగతా 2 లో..

## ఆమ్రాబాద్‌లో రాత్రి వాహనాల నిషేధం

- వన్యప్రాణుల రక్షణకు కఠిన చర్యలు
- రాత్రి 9 నుంచి ఉదయం 6 వరకు ఆంక్షలు
- అత్యవసర సేవలకు మాత్రమే మినహాయింపు
- వాహనదారులు సహకరించాలని విజ్ఞప్తి



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 26**

:

వన్యప్రాణుల సంరక్షణతో పాటు రహదారులపై వాహనాల రాకపోకల కారణంగా జంతువులకు ఎదురవుతున్న ప్రమాదాలను నివారించేందుకు

మిగతా 2 లో..




## గ్రామీణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ఉమ్మడి నాలుగు జిల్లాల ప్రాంతీయ సమీక్ష సమావేశం
- గ్రామీణాభివృద్ధి, తాగునీటి పథకాల పురోగతిపై సమీక్ష
- పెండింగ్ భవనాలు, తాగునీటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించిన మంత్రి సీతక్క

**రంగారెడ్డి, సెప్టెంబర్ 26**

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో వేగం పెంచి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలకు సంబంధించిన ప్రాంతీయ సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న

మిగతా 2 లో..

## విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వంతో పోరాటం చేస్తాం

- ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితిపై తీవ్ర ఆందోళన
- ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తామని వెల్లడి
- ప్రజా సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణకు సిద్ధం

**హైదరాబాద్, సెప్టెంబర్ 26**

రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె పలు అంశాలపై

మిగతా 2 లో..



## లంచం తీసుకుంటూ సీడీపీవో పట్టివేత

- అవినీతి నిరోధక శాఖ వలలో అధికారి
- రూ.63 వేల లంచం స్వీకరిస్తూ పట్టుబాటు
- అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల పేరుతో డిమాండ్
- జగిత్యాల జిల్లాలో కలకలం



**జగిత్యాల, సెప్టెంబర్ 26**

జగిత్యాల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నిర్వహించిన ప్రత్యేక చర్యలో మెట్‌పల్లి శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి దారోజు పద్మ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అధికారిక విధుల్లో

మిగతా 2 లో..



## చాకలి ఐలమ్మ ఆశయాలు చిరస్మరణీయం

- మహబూబ్‌నగర్‌లో 131వ జయంతి వేడుకలు
- ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించిన వి. శ్రీనివాస్ గౌడ్
- తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ సేవలు అమోఘం
- మహిళా చైతన్యానికి ప్రతీకగా కొనియాడిన మాజీ మంత్రి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 26**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజన వర్గాల స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ ఆశయాలు చిరస్మరణీయమని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లో చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో..

## హైదరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయ హోదాపై అభ్యంతరం

- హోదా తగ్గింపు ప్రతిపాదనను వ్యతిరేకించిన ఒవైసీ
- కేంద్ర మంత్రులకు లేఖ రాసిన హైదరాబాద్ ఎంపీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 26**

హైదరాబాద్ నగర చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్న హైదరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయ హోదాను తగ్గించాలన్న ప్రతిపాదనపై హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ

మిగతా 2 లో..

## ఆయిల్‌పామ్‌కు ప్రాసెసింగ్ విస్తరణ



- మూడేళ్లలో పది లక్షల ఎకరాల లక్ష్యం
- రైతులకు సమీపంలోనే ప్రాసెసింగ్ సదుపాయాలు
- సామర్థ్య పెంపుపై మంత్రి తుమ్మల సమీక్ష

**నర్మెట్ట, సెప్టెంబర్ 26**

తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అనుగుణంగా ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని కూడా పెంచాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

మిగతా 2 లో..

# పూరిగుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం వెనుకడుగు వేయడం లేదన్నారు. పేదల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని పాలన సాగిస్తున్నామని చెప్పారు. పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి విడతల వారీగా ఇల్లు అందించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. వచ్చే దసరా నాటికి 2.18 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి ప్రతి నియోజకవర్గానికి అదనంగా 2 వేల ఇళ్లు కేటాయించామని చెప్పారు. పూరిళ్లలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. జనగామ నియోజకవర్గంలో గుర్తించిన 500 పూరిళ్ల కుటుంబాలకు ఈ వేదికపైనే రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లు, మొండిగోడలతో ఉన్న ఇళ్లను పూర్తి చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నామని తెలిపారు.

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇప్పటికే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త తెల్ల రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు హాస్టళ్లలో డైట్ ఛార్జీలను 40 శాతం పెంచడంతో పాటు ఇతర సౌకర్యాలను కూడా విస్తరించామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాల సమీకృత విద్యాసంస్థలను నిర్మిస్తున్నామని వెల్లడించారు.

మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు ఇప్పటివరకు రూ.70 వేల కోట్లకు పైగా వడ్డీలేని రుణాలు అందించామని మంత్రి పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు రైతు భరోసా పథకం కొనసాగుతోందని, వరి సాగు చేసిన రైతులకు మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయగా, మరో 14 నుంచి 15 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు. జనగామ మున్సిపాలిటీ అభివృద్ధికి తొలి విడతగా రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పూర్తికాని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నివాసయోగ్యంగా మార్చి అర్హులైన లబ్ధిదారులకు దసరా నాటికి అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఏ అర్హ కుటుంబం కూడా ఇందిరమ్మ ఇల్లు విషయంలో నిరాశ చెందాల్సిన అవసరం లేదని, మూడో, నాలుగో విడతల్లో కూడా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# గ్రామీణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని మంత్రి సమీక్షించారు. జిల్లాల వారీగా జరుగుతున్న పనుల స్థితిగతులను తెలుసుకుని పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపడుతున్న రహదారి నిర్మాణ పనులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించిన మంత్రి, పనుల నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం రహదారుల నిర్మాణం కీలకమని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులు, తాగునీటి సమస్యలు, వ్యవసాయ రంగంపై ప్రభావం వంటి అంశాలను ముందుగానే అంచనా వేసి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామ పంచాయతీ భవనాలు, గ్రామీణ సంఘాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ పనులను వేగవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామీణ తాగునీటి సరఫరా పథకాల అమలుపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామానికి నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు.

## విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వంతో పోరాటం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

విస్తృతంగా మాట్లాడారు. ఆరోగ్యం, విద్య వంటి మౌలిక రంగాలపై ప్రభుత్వం తగినంత శ్రద్ధ చూపడం లేదని ఆరోపిస్తూ, ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యం తగదన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, వసతి గృహాల పరిస్థితిని తక్షణమే మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రిలో ఇటీవల జరిగిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కవిత, చిన్నారుల మరణాలకు సంబంధించిన గణాంకాలు కలచివేశాయని అన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం శిశు మరణాల సంఖ్య ఆందోళన కలిగించే స్థాయిలో ఉందని పేర్కొన్నారు. ప్రజారోగ్య వ్యవస్థలో లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య రంగానికి తగిన నిధులు కేటాయించడంతో పాటు కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రంలోని పలు ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల కొరత, వైద్యుల కొరత, సిబ్బంది సమస్యలు కొనసాగుతున్నాయని కవిత పేర్కొన్నారు. కొన్ని ఆస్పత్రుల్లో రోగుల సంఖ్యకు తగిన సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వైద్య సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆరోగ్యశ్రీ వంటి పథకాల అమలులో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ భూములు పొందిన ప్రైవేట్ ఆస్పత్రులు నిర్దిష్ట శాతం ఉచిత వైద్యం అందించే విధంగా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. విద్యా రంగంపై కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని అన్నారు. ముఖ్యంగా బాలికల కోసం మరుగుదొడ్లు, పరిశుభ్రత సదుపాయాలు, శానిటరీ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలు తగిన స్థాయిలో లేవని పేర్కొన్నారు. పాఠశాలలు, వసతి గృహాల పరిస్థితిని జిల్లా అధికారులు తరచూ పరిశీలించాలని, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యా నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, వసతి గృహాల పరిస్థితిపై తమ పార్టీ ప్రత్యేక పరిశీలన కార్యక్రమాన్ని చేపడుతుందని కవిత ప్రకటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లాల వారీగా పర్యటించి సమస్యలను నమోదు చేస్తారని తెలిపారు. ప్రజలు, యువత కూడా తమ ప్రాంతాల్లోని ప్రభుత్వ సంస్థల పరిస్థితులను పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే విద్య, వైద్య రంగాల్లో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. రాజకీయ అంశాలపై మాట్లాడుతూ ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిని బరిలోకి దింపుతామని కవిత వెల్లడించారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలనే ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకు సాగుతామని చెప్పారు. సాగునీరు, తాగునీరు, గిరిజన సంక్షేమం, ప్రజారోగ్యం, విద్య వంటి అంశాలపై కూడా త్వరలో ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై మరింత దృష్టి సారించాలని, ప్రజల సంక్షేమమే పరిపాలనకు కేంద్రబిందువుగా ఉండాలని కవిత పేర్కొన్నారు.

## లంచం తీసుకుంటూ సీడీపీవో పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

అనుకూలత చూపేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.63 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ అధికారులు శనివారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. అవినీతి నిరోధక శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణ మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల సమయంలో ప్రతికూల వ్యాఖ్యలు నమోదు చేయకుండా ఉండేందుకు అధికారి అక్రమంగా డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మొత్తం 21 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి నెలకు వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేయాలని కోరినట్లు అధికారులు తెలిపారు. మూడు నెలల కాలానికి సంబంధించి మొత్తం రూ.63 వేలుగా లంచం నిర్ణయించినట్లు వెల్లడించారు. ఫిర్యాదు అందుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు ప్రత్యేకంగా వల పన్ని చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కార్యాలయ ఆవరణ వెలుపల ఫిర్యాదుదారుడి నుంచి రూ.63 వేల లంచం స్వీకరిస్తుండగా అధికారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమె వద్ద నుంచి లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజాసేవలో ఉన్న అధికారులు తమ అధికారాలను దుర్వినియోగం చేసి అక్రమ ప్రయోజనాలు పొందడం చట్టవిరుద్ధమని అవినీతి నిరోధక శాఖ పేర్కొంది. విధి నిర్వహణలో అనుకూలత చూపేందుకు లంచం డిమాండ్ చేయడం, స్వీకరించడం అవినీతి నిరోధక చట్టాల కింద నేరమని స్పష్టం చేసింది. ఈ ఘటనపై మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. పట్టుబడిన అధికారిని అరెస్టు చేసి కరీంనగర్‌లోని ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసుకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు వెంటనే అవినీతి నిరోధక శాఖ ఉచిత సహాయ సంఖ్య 1064కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ఫిర్యాదు చేసిన వారి పేరు, వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా కూడా అవినీతి నిరోధక శాఖను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# ఆయిల్‌పామ్‌కు ప్రాసెసింగ్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

నాగేశ్వరరావు అన్నారు. రానున్న మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పది లక్షల ఎకరాలకు చేర్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలోని ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతితో కలిసి సందర్శించిన మంత్రి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాసెసింగ్ కేంద్రంలో పండ్ల గుత్తుల సేకరణ, రవాణా, ప్రాసెసింగ్ విధానం, నీటి లభ్యత, నిర్వహణ వ్యవస్థ, రైతులకు అందుతున్న సేవలపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు డెబ్బై వేల మెట్రిక్ టన్నులకు పైగా పండ్ల గుత్తులను ప్రాసెస్ చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం గంటకు ముప్పై టన్నుల సామర్థ్యంతో కేంద్రం పనిచేస్తోందని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా దీన్ని మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతున్నకొద్దీ పండ్ల ఉత్పత్తి కూడా భారీగా పెరుగుతుందని, అందువల్ల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచడం అత్యవసరమని మంత్రి పేర్కొన్నారు. నర్మెట్ట కేంద్రాన్ని భవిష్యత్‌లో గంటకు నూట ఇరవై టన్నుల సామర్థ్యానికి విస్తరించే అవకాశాలు ఉండటం సానుకూల పరిణామమన్నారు. రైతులు పండించిన పంటను సకాలంలో ప్రాసెస్ చేయగలిగితే నాణ్యతతో పాటు ఆదాయం కూడా పెరుగుతుందని వివరించారు. రైతులు తమ పంటను దూర ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం లేకుండా సమీప ప్రాంతాల్లోనే ప్రాసెసింగ్ కేంద్రాలు అందుబాటులో ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. కోత అనంతరం వీలైనంత త్వరగా ప్రాసెసింగ్ జరిగితే పంట నాణ్యత కాపాడబడుతుందని, రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. సాగు విస్తరణకు అనుగుణంగా ప్రాసెసింగ్ కేంద్రాలు, రవాణా సదుపాయాలు, ఇతర మౌలిక వసతులను ప్రభుత్వం దశలవారీగా పెంచుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ రైతులతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు. పంట దిగుబడులు, సాగు విధానాలు, కోతలు, రవాణా, ప్రాసెసింగ్ అంశాలపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. శాస్త్రీయ పద్ధతులు, సరైన నీటి యాజమాన్యం, సమయానుకూలంగా కోతలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను మంత్రికి వివరించగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రాసెసింగ్ కేంద్రానికి అవసరమైన నీటి లభ్యతపై కూడా మంత్రి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. వర్షపాతం తక్కువగా ఉన్న పరిస్థితుల్లో కేంద్రానికి నీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన నీటిని సమీప జలాశయాల నుంచి అందుబాటులోకి తీసుకువచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన పంటను సకాలంలో సేకరించి ఎలాంటి జాప్యం లేకుండా ప్రాసెస్ చేసే విధంగా సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఆయిల్‌పామ్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయాలు చిరస్మరణీయం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల కోసం ఆమె చూపిన ధైర్యసాహసాలు నేటి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.నిజాం పాలనలో సామాన్య ప్రజల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలక అధ్యాయమనిఅన్నారు. అన్యాయాలకు ఎదురొడ్డి నిలిచి మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిన గొప్ప నాయకురాలిగా ఆమెను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సాధికారత, సామాజిక సమానత్వం, స్వాభిమాన పోరాటాలకు చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆమె ఆశయాలను యువత అధ్యయనం చేసి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తెలంగాణ సమాజ నిర్మాణంలో ఆమె పాత్ర విశిష్టమని అన్నారు. చాకలి ఐలమ్మ జీవితం పోరాటస్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనమని, బహుజన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆమె చూపిన మార్గం నేటికీ ఆదర్శప్రాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల ప్రతినిధులు, అభిమానులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె సేవలను స్మరించుకుంటూ పలువురు నాయకులు ప్రసంగించారు.

# హైదరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయ హోదాపై అభ్యంతరం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత మంత్రులకు లేఖ రాశారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ సంస్థ హోదాను తగ్గించడం నగర వారసత్వానికి నష్టం కలిగించే చర్యగా ఆయన అభివర్ణించారు. హైదరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న ఉన్నత స్థాయి నుంచి దిగువ స్థాయికి మార్చి, నగర తపాలా విభాగంలో విలీనం చేయాలన్న ప్రతిపాదన ఇటీవల వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఒవైసీ స్పందించారు. ఈ నిర్ణయం తీసుకునే ముందు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న సంస్థ విషయంలో ఏకపక్ష నిర్ణయాలు సరైనవి కావని తన లేఖలో వివరించారు.

హైదరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయం రాష్ట్రంలో అత్యంత రద్దీగా పనిచేసే తపాలా కేంద్రాల్లో ఒకటిగా కొనసాగుతోందని ఒవైసీ గుర్తు చేశారు. నగర పరిధిలోని భారీ స్థాయిలో ఉత్తరాలు, పార్శిళ్లు, ఇతర తపాలా సేవలు ఈ కార్యాలయం ద్వారా నిర్వహించబడుతున్నాయని తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న సేవల అవసరాలను దృష్టిలో ఉంచుకుంటే ఈ కార్యాలయ ప్రాముఖ్యత మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో తపాలా బిళ్లల సేకరణ, తపాలా చరిత్ర పరిరక్షణకు సంబంధించిన ప్రత్యేక కేంద్రం కూడా ఇక్కడే పనిచేస్తోందని ఒవైసీ వివరించారు. తపాలా వ్యవస్థ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇలాంటి ప్రత్యేకతలు కలిగిన సంస్థ హోదాను తగ్గించడం సమంజసం కాదని, దాని స్వతంత్ర గుర్తింపును కాపాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని లక్షలాది మంది ప్రజలకు ఈ కార్యాలయం సేవలు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. తపాలా సేవలతో పాటు వివిధ ప్రభుత్వ, ఆర్థిక, ప్రజా సేవలకు కూడా ఈ కార్యాలయం కేంద్ర బిందువుగా ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంస్థ పనితీరును మరింత బలోపేతం చేయాల్సి ఉండగా, హోదా తగ్గింపు వంటి చర్యలు తీసుకోవడం సరికాదని అన్నారు. ప్రజా ప్రయోజనాలు, చారిత్రక వారసత్వం, సంస్థ ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను పునఃసమీక్షించాలని ఒవైసీ కోరారు. హోదా తగ్గింపు, విలీనం ప్రతిపాదనలను పూర్తిగా రద్దు చేసి, హైదరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయాన్ని స్వతంత్ర హోదాతో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, ప్రజలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

(మొదటి పేజీ తరువాయి)

చాకలి ఐలమ్మ నిర్భయంగా పోరాడారని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం ఆమె సాగించిన ఉద్యమం తెలంగాణ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిందని తెలిపారు. సామాన్య ప్రజల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగాలు నేటి తరానికి కూడా స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ పోరాటం కేవలం వ్యక్తిగత హక్కుల కోసం సాగిన ఉద్యమం కాదని, అది సామాజిక న్యాయం కోసం జరిగిన ప్రజా పోరాటమని ముఖ్యమంత్రి వివరించారు. సామాజిక వివక్ష, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యసాహసాలు ప్రజల్లో చైతన్యం నింపాయని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె పాత్ర చారిత్రాత్మకమని గుర్తు చేశారు. దోపిడీ శక్తులకు ఎదురొడ్డి నిలిచిన చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని ముఖ్యమంత్రి కొనియాడారు. మహిళల సాధికారత, సామాజిక సమానత్వం, న్యాయం కోసం ఆమె చూపిన మార్గం నేటికీ ప్రాసంగికంగానే ఉందన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం సమాజం బాధ్యత అని పేర్కొన్నారు.

# ఆమ్రాబాద్‌లో రాత్రి వాహనాల నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో రాత్రివేళ వాహనాల రాకపోకలపై అటవీ శాఖ కఠిన ఆంక్షలు అమలు చేయాలని నిర్ణయించింది. టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో వన్యప్రాణుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.టైగర్ రిజర్వ్‌లలోని కోర్ ప్రాంతాలు, క్రిటికల్ టైగర్ హ్యాబిటాట్ ప్రాంతాల మీదుగా వెళ్లే రహదారులపై రాత్రి సమయంలో వాహనాల రాకపోకలను నియంత్రించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం వరకు అత్యవసర సేవలకు సంబంధించిన వాహనాలను మినహాయించి ఇతర వాహనాలను అనుమతించవద్దని స్పష్టం చేసింది. ఈ ఆదేశాల అమలులో భాగంగా ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అటవీ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు సాధారణ వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదు. ఈ సమయంలో అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, ఇతర అత్యవసర విధుల్లో ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి కల్పించనున్నారు. మిగిలిన వాహనాలను రిజర్వ్ అటవీ ప్రాంతాల్లోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు.రాత్రివేళల్లో రహదారులపై సంచరించే పులులు, చిరుతలు, జింకలు, అడవి పందులు తదితర వన్యప్రాణులు వాహనాల ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అటవీ అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వన్యప్రాణుల సహజ జీవనానికి ఆటంకం కలగకుండా రాత్రి వేళల్లో వాహనాల నియంత్రణ అవసరమైందన్నారు. పర్యావరణ సమతుల్యత పరిరక్షణకు ఈ నిర్ణయం దోహదపడుతుందని తెలిపారు.ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్ దేశంలోని ముఖ్యమైన పులుల ఆవాస ప్రాంతాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇక్కడ పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, అరుదైన పక్షులు, అనేక జాతుల వన్యప్రాణులు నివసిస్తున్నాయి. వీటి సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు.

# చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటితరానికి స్ఫూర్తిదాయకం

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- సమాజంలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ చరిత్ర చిరస్మరణీయం
- చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలలో పాల్గొన్ని, ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్- 26 (భద్రాద్రిన్యూస్):** సమాజంలోని అసమానతలకు ఎదురొడ్డి, వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం ఖమ్మం, వైరా రోడ్డులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సమీపంలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని తెలిపారు. జమీందారుల పాలనలో కొనసాగిన వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందన్నారు. చాకలి ఐలమ్మ సామాజిక సేవకురాలిగా, భూ పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తనదైన పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె పోరాట పటిమ, ధైర్యసాహసాలు మహిళా శక్తికి ప్రతీకగా నిలిచాయని, నేటి తరానికి కూడా ఆమె జీవితం ఆదర్శప్రాయమని అన్నారు.

సమాజ హితం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను, వారి సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని చాటి చెప్పారని కలెక్టర్ అన్నారు. ఆమె ఆశయాలు, పోరాట విలువలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి జి. జ్యోతి, బిసి సంఘ నాయకులు తుపాకుల ఎలగొండ స్వామి, జక్కుల వెంకట రమణ, కొత్తకొండ శ్రీలక్ష్మి, తమ్మారపు బ్రహ్మయ్య, సట్టు వెంకటేశ్వర్లు, తెనాలి వీరబాబు, మాచర్ల వేలాద్రి, పగిడల కృష్ణవేణి, కణతాల నరసింహారావు, హరిప్రసాద్, వట్టికోట అప్పారావు, వల్లపు సోమరాజు, అమరగాని వెంకటేశ్వర్లు, లింగబోయిన పుల్లారావు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది, బిసి కుల సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టీఐ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన డీఎస్పీ ఆదినారాయణ



**కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (భద్రాద్రిన్యూస్):** అక్టోబర్ 7న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్న సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవం, అవగాహన సదస్సు పోస్టర్‌ను కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ శనివారం ఆవిష్కరించారు. ఆర్టిఐ భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కనుకుంట్ల కుమార్‌తో పాటు సమాచార హక్కు చట్టం కమిటీ సభ్యులు సందీప్, నాగరాజు, వీరభద్రం,తరుణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతు ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం కీలకమన్నారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకుని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆర్‌టీఐ చట్టాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు మాట్లాడుతు ఆర్‌టీఐ జాతీయ కన్వీనర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆవిర్భావ మహాసభలో సమాచార హక్కు చట్టం ప్రాధాన్యత, చట్టం వినియోగ విధానం, పారదర్శక పాలన తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లా నుండి ప్రజా ప్రతినిధులు, ఆర్‌టీఐ కార్యకర్తలు, సామాజికవేత్తలు, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అక్టోబర్ 7న జరిగే సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# వేడుకగా ఆర్జేసి డిగ్రీకళాశాల ఫ్రెషర్స్ డే





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 26 (భద్రాద్రిన్యూస్ ):-** స్థానిక ఆర్జేసి డిగ్రీ కళాశాల ప్రె షర్స్ డే శనివారం నగరంలోని ఓ ప్రవేట్ ఫంక్షన్ హాల్ లో వేడుకగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ హాజరయ్యారు తొలుత ఆయన జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు .ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని ఏర్పరచుకొని ప్రణాళిక ప్రకారం కష్టపడితే దేనినైనా సాధించ వచ్చున్నారు . 28 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఆర్జేసి డిగ్రీ కళాశాల తన ప్రస్థానంలో అనేక విజయాలు సాధించిందని తెలిపారు.తమ కళాశాల కు చెందిన అనేక మంది విద్యార్థులు సైంటిస్టు, విద్యా, కళా,క్రీడా,వ్యాపార,రాజకీయ,ప్రభుత్వ ఉద్యోగ రంగాలలో స్థిర పడి ఉన్నారని తెలిపారు.దీనితో పాటు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన ఘనత ఆర్జేసిదేనన్నారు. డిగ్రీ స్థాయి లో బహుళ జాతి కంపెనీల్లో ప్లేస్మెంట్ లు సాధించిన ఘనత కూడా తమ కళాశాలకే దక్కుతుందన్నారు.ఇప్పటి వరకు కళాశాల విద్యార్థులు సాగించిన విజయ పరంపరను ప్రస్తుత సంవత్సరం విద్యార్థులు కూడా కొనసాగించాలని సూచించారు.దీనికి విద్యార్థులు నిరంతరం కళాశాలకు హాజరవుతూ ఉపాధ్యాయులు చెప్పినదాన్ని అర్థం చేసుకుని ప్రణాళిక ప్రకారం కష్టపడితే సాధించ వచ్చున్నారు.నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని,ఆదిశ లోనే ఇప్పటి వరకు తమ విద్యార్థులు నడుచుకున్నారని,ప్రస్తుత సంవత్సరం విద్యార్థులు కూడా ఆవిధంగా ముందుకు సాగుతూ తల్లిదండ్రుల కలల ను నెరవేర్చాలని,తద్వారా మీకు పాఠాలు చెప్పిన అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం ఈ విద్యా సంవత్సరం పలు విభాగాలలో,పరీక్షలలో గెలుపొందిన పలువురు విద్యార్డులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి అతిథి గా విచ్చేసిన కృష్ణను కళాశాల విద్యార్థులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. చివరగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్, వెస్టన్,బ్రేక్,గ్రూప్, సోలో తదితర డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ.లింగయ్య,ఇన్చార్జి లుఆంజనేయులు, సునంద తదితరులు పాల్గొన్నారు.

# సర్వజ్ఞ సూపర్ కిడ్జ్‌లో ఘనంగా "ఫైర్‌లెస్ కుకింగ్ -- డాడ్స్ & కిడ్స్" కార్యక్రమం





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 26 ( భద్రాద్రిన్యూస్ ):** సర్వజ్ఞ సూపర్ కిడ్జ్‌లో చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించడంతో పాటు తండ్రులు--పిల్లల మధ్య అనుబంధాన్ని మరింత బలపరిచే ఉద్దేశంతో "ఫైర్‌లెస్ కుకింగ్ -- డాడ్స్ ఌ కిడ్స్" కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. మంటను ఉపయోగించకుండా తండ్రులు తమ చిన్నారులతో కలిసి వివిధ రకాల రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటకాలను తయారు చేశారు. పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. తండ్రులు, పిల్లలు కలిసి వంట చేయడం ద్వారా సహకారం, పరిశుభ్రత, ఆహారంపై అవగాహన, స్వయం ఆధారితత వంటి విలువలు పిల్లల్లో పెంపొందాయి. తండ్రుల సృజనాత్మకత, పిల్లల ఉత్సాహం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమం తల్లిదండ్రులను పాఠశాల కార్యకలాపాల్లో భాగస్వాములను చేస్తూ, పిల్లల సమగ్ర అభివృద్ధికి పాఠశాల అందిస్తున్న అవకాశాలకు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా సర్వజ్ఞ చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ ,డైరెక్టర్ నీలిమ కార్యక్రమంలో పాల్గొన్న తండ్రులు, చిన్నారులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు కుటుంబ విలువలను పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయ బృందాన్ని కూడా వారు అభినందించారు.

# హాఫ్ శారీ వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించిన ఏలూరి శ్రీనివాసరావు



సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 26 (భద్రాద్రిన్యూస్ ):-** ఖమ్మంలోని ఎస్.ఆర్. గార్డెన్స్‌లో ఖమ్మం జిల్లా కలెక్టర్ క్యాంప్ క్లర్క్ (సి.సి) శ్రీ రాచకొండ సాయి నరేష్ కుమార్తె హాఫ్ శారీ ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు టి.జి.ఓ.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు, టి.జి జాక్రాష్ట్ర సెక్రెటరీ జనరల్ శ్రీ ఏలూరి శ్రీనివాసరావు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపిన ఏలూరి శ్రీనివాసరావు.. వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు కూడా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో ఎస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీ కొణిదెన శ్రీనివాస్, ఎన్జీవో ఎస్ సెంట్రల్ యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ జెడ్ ఎస్. జైపాల్, టి.జి.ఓ.ఎస్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ శ్రీ గంగవరపు నరేంద్ర, మల్లెల రవీంద్ర ప్రసాద్, ఎస్ సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్జీవో ఎస్ నాయకులు అస్లాం, కోటపాటి రుక్మారావు, పవన్, బిట్ట ప్రవీణ్, జంగం లక్ష్మణరావు తదితరులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి కుటుంబ

# గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పోలీస్ ఫ్యామిలీ క్వార్టర్స్‌లో అన్నదానం

- పోలీస్ కుటుంబాలతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్
- గణేష్ విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న పోలీస్ సిబ్బంది



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 26 (భద్రాద్రిన్యూస్):** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖమ్మం పోలీస్ ఫ్యామిలీ క్వార్టర్స్‌లో పోలీస్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా పోలీస్ కుటుంబాలు ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని పోలీస్ కమిషనర్‌తో పాటు పోలీస్ అధికారులు సందర్శించి, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పాల్గొని, పోలీసు సిబ్బందికి మరియు వారి కుటుంబ సభ్యులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. పోలీస్ కుటుంబాలతో కలిసి గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా సిబ్బందిలో ఆత్మీయత, కుటుంబ భావన మరింత బలపడుతుందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.



**గణేష్ విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న పోలీస్ సిబ్బంది**

పది రోజులుగా గణేష్ నవరాత్రుల బందోబస్త్ విధులలో వున్న పోలీస్ సిబ్బంది ఈ రోజు గణేష్ నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణేష్ విగ్రహ శోభాయాత్రలో పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.భక్తిశ్రద్ధలతో సాగిన శోభాయాత్రలో పోలీస్ సిబ్బంది పాల్గొని, ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో ఇంటిలిజెన్స్ ఎస్పీ రామానుజం, అడిషనల్ డీసీపీ రామానుజం, ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి,విజయబాబు, టౌన్ ఏసీపీ రమణమూర్తి, రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, ఎస్బీ ఏసీపీ మహేష్, సర్వర్,శ్రీనివాసులు, ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, ఆర్ ఐ లు కామరాజు, సురేష్, అప్పలనాయుడు, సాంబశివరావు, సిఐ లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోరాట జ్యోతి, వీరనారి చాకలి ఐలమ్మ

- మేకల మల్లి బాబు యాదవ్



**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 26 (భద్రాద్రిన్యూస్ ):** భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఝాన్సీ లక్ష్మీబాయి పోరాటం చేస్తే, తెలంగాణ కోసం వీరనారి చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య లాంటి వారు చేసిన అసాధారణ పోరాట ఫలితంగానే నేడు మనం తెలంగాణ ఫలితాలు అనుభవిస్తున్నామని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తెలిపారు. కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీసీ కులాల ప్రతినిధుల సమక్షంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ నిజాం నిరంకుశ పరిపాలనలో గ్రామాలలో దొరలు భూస్వాములు దేశముఖ్ లు ప్రజలను, మహిళలను బానిసలుగా చేసి వెట్టి చాకిరి పేరుతో ప్రజల శ్రమను దోపిడీ చేస్తూ, రైతుల భూములను అక్రమంగా లాక్కొని, ఉచితంగా పనులు చేయించు కుంటున్న ఆ రోజులలో అందరూ భయపడి ఊరుకున్నారు కానీ తనకున్న 4ఎకరాల భూమిని ఇవ్వనని చావనైన చస్తాను గాని భూమి ఇవ్వనని, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా దొరల అహంకారానికి వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలబడి పోరాటం చేసిన చాకలి ఐలమ్మకు మద్దతుగా చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు, ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీల సహకారంతో తిరుగుబాటు చేశారు. ఐలమ్మకు చదువు లేకపోయినా ఆత్మ గౌరవం కోసం పోరాటం చేసింది. భూమి మనది, శ్రమ మనది, పంటమన్నది. అనుభవించేది పాలించేది దొరలా అని ప్రశ్నించే మొదటి గొంతుక అయింది చాకలి ఐలమ్మ అని కొనియాడారు. సమాజంలో జరిగే ప్రతి అన్యాయానికి ఒక మహిళగా ఆమె ఒక్కతే ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ముదిరాజ్ సంఘం మండల నాయకులు శీలం పుల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, వడ్డెర సంఘం నాయకులు తురక బిక్షం చల్ల మల్లయ్య, ఓబీసీ జిల్లా నాయకులు చల్ల మల్లయ్య, చింతలపెద్ద వెంకయ్య,బాధావత్ నాగరాజు, జక్కంపూడి వెంకటేశ్వర్లు గుగులోత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు

# బహుముఖ పోరాట ధీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ



## కొండా స్ఫూర్తితో బి.సి వాటా సాధించాలి

**భద్రాద్రి న్యూస్ ,కాలమిస్ట్:**

చరిత్ర పుటల్లో స్వయం కృషితో తన పేరును తనే లిఖించుకున్న గొప్ప ప్రజ్ఞాశాలి కొండా లక్ష్మణ్ బాపూజి జీవిత చరిత్రను, చరిత్రను వేరుచేసి చూడడం చాలా కష్టం. తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించి రాజకీయ నాయకుడిగానే కాదు, రాజనీతిజ్ఞుడిగా విశేష కీర్తిని పొందిన బాపూజి జీవిత చరిత్రను ఆవిష్కరించడం అంత సులువైన విషయమేమికాదు. తను జ్ఞాపకం ఎరిగిన నాటినుండి ఉద్యమాలే జీవితంగా బతికి తన సర్వస్వాన్ని ప్రజల కోసం దారపోసిన ధీశాలి, తెలంగాణ కోసం మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకోవడమే కాకుండా తెలంగాణ వచ్చేవరకు ఏ ఒక్క పదవిని తీసుకోనని శపథం చేసి ఆచరించిన మహా నిష్టాగరిష్ఠుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ. 20, 21వ శతాబ్దాల భిన్న దశలలో జీవించిన రాజకీయ నాయకుల్లో బాపూజీ జీవితం విశిష్టమైనది. ఆయన జీవితం తెలంగాణ విశాల రాజకీయ, సాంఘిక చరిత్రల తాలూకు స్వాతంత్ర్యానంతరం కంపుకొడుతున్న భారతదేశపు రాజకీయ చట్రానికి వెలుపల ప్రజా రాజకీయాలకు అద్దం పడుతుంది. పేదలపై పెత్తందారి అరాచకాలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే కాకుండా ఏక కాలంలో ఆరు భిన్నమైన అంతర్గత సంబంధం కలిగి ఉన్న ప్రజా ఉద్యమాలతో ఆయన జీవితం ముడిపడి ఉన్నదని చెప్పడం సముచితం. అవి వరుసగా నిజాం వ్యతిరేక పోరాటం, వెనుకబడిన తరగతుల ఉద్యమం, చేనేత సహకారోద్యమం, తెలంగాణ రైతాంగ పోరాటం, స్వాతంత్రోద్యమం, ప్రత్యేక తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలు.

నియంతృత్వ భూస్వామ్య నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా తలెత్తిన ఉద్యమంలో యువ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించిన బాపూజీ చాలామంది కాంగ్రెస్ నాయకుల మాదిరిగానే అహింసను ప్రబోధించే గాంధేయ తత్వానికి బహిరంగ జీవితంలో కట్టుబడి ఉంటూనే నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ ప్రతిఘటనోద్యమంలో ఆయన క్రియాశీలంగా పాల్గొన్నారు. జాతీయోద్యమంలో సామాజిక మూలాలు వీడకుండా ప్రజా రాజకీయాలు చేసిన బాపూజీ చేనేత సహకారోద్యమంలో నేతన్నల హక్కుల సాధనకు శ్రమించారు. చేనేత మగ్గాల యజమానులు, వ్యాపారుల ప్రయోజనాలు, నేత పనివారల ప్రయోజనాలు ఒకటి కాదని ఆయన సాగించిన ఉద్యమం అట్టడుగు శ్రేణులకు చేరువ చేసింది. కార్యకర్తగా స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర వహించిన బాపూజీ ఎం.ఎస్ రాయ్ ఆలోచనలు, రచనలకు, ప్రసంగాలకు ప్రభావితుడై ఆయన ప్రసంగాలను 'భారత విప్లవ సమస్యలు' అనే పేరుతో ఉర్దూలోకి అనువాదం చేసి ముద్రించారు. రాజకీయాలు, ప్రజా జీవితంలో ఉన్నవారు నిష్కపటంగా, నిజాయితీగా ఉండాలని బోధించిన బాపూజి పరస్పర విరుద్ధమైన సుభాష్ చంద్రబోస్ అతివాద ధోరణి, గాంధీజీ సామ్యవాద ఆలోచన ధోరణి బాపూజీపై తీవ్ర ప్రభావం చూపాయి. పల్లెలు, పట్టణాల్లోని మురికి వాడల్లో ఉండే పేదలు కుటీర పరిశ్రమల్లో, వంశపారంపర్యంగా వస్తున్న వృత్తులు చేసుకుని బతికే వారి జీవితాలను మార్చాలని అనుక్షణం తపించిన వ్యక్తి బాపూజి వడ్రంగి, కంసాలి, కంచర, మేధర, బెస్త, కల్లుగీత కార్మికుల, దర్జీల, వడ్డెరుల లాంటి ఉత్పత్తి కులాల అభ్యున్నతి కోసం విశేష కృషి చేశారు. గ్రామీణ జీవణానికి, ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకలై ఉండి కూడా సామాజిక హోదా లేక తక్కువగా చూడ బడుతూ ఎలాంటి అధికార దర్పానికి ఆస్కారం లేని, ఆర్థికంగా గిట్టుబాటు లేని, అశుభ్రకరమైన కుల వృత్తుల్లో సాంప్రదాయంగా మనుగడ సాగిస్తున్న బి.సి కులాలకు నాణ్యమైన విద్య, ఆర్థిక సామర్థ్యం తగినంత లేకుండా సామాజిక, రాజకీయ సాధికారత సాధించడం వీలుకాదనే వాస్తవాన్ని గుర్తించిన బాపూజీ చేనేత వృత్తి కులాలే కాకుండా ఇతర బి.సి కులాలు కూడా తమ తమ వృత్తుల ద్వారా తమ ఆర్థిక స్థోమతను మెరుగుపరచుకొనగలిగే కార్యక్రమాలను ఆయన జీవితకాలంలో ఎన్నో చేశారు. స్వాతంత్ర్యానంతరం రాజకీయాలు భ్రష్టుపట్టిపోవడం, క్రమక్రమంగా రాజకీయ, సామాజిక విలువల పతనంలోనూ బాపూజీ విలువల కోసం నిలబడ్డాడు. బలహీన వర్గాల నాయకత్వం బి.సి ఉద్యమాలు, రిజర్వేషన్ల పేరిట కొందరు అందలాలెక్కే ప్రణాళికలు వేసుకుంటున్న ఇప్పటి నాయకత్వాలకు మొత్తంగా సామాజికన్యాయం దృష్టి కానీ, బలహీన వర్గాల హక్కుల దృష్టి కానీ కొరవడిన కాలంలో బాపూజీ అవగాహనలో, పని విధానంలో లోతైన దృష్టి పెట్టాడు. వ్యవసాయాధారిత వృత్తులు, చేతి వృత్తులు అంతరించిపోతున్న క్రమంలో జీవనోపాది అవసరాలు హఠాత్తుగా కనుమరుగై ప్రత్యామ్నాయం లేక కోట్లాది మంది ఉపాధి కోల్పోతున్న తరుణంలో ఆయన రాజకీయ పోరాటాల్లో అంతర్లీనంగా వృత్తులు బలపడడం గురుంచి యోచన చేసిన మహనీయులు బాపూజీ.

మూడు తరాల ఉద్యమానికి సాక్షిగా నిలిచిన కొండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ఉద్యమ రూపంలో ముందుకు వచ్చిన అన్ని సందర్భాల్లో బాపూజీ క్రియాశీలక పాత్ర వహించారు. 1956 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటును ప్రతిఘటించిన ఉద్యమంలో, 1960 దశాబ్దాల చివరి నాళ్ళలో పెద్ద ఎత్తున తలెత్తిన ఉద్యమంలో 1995 లో ముందుకు వచ్చిన రెండో దశ తెలంగాణ ఉద్యమంలో, చివరి దశ తెలంగాణ ఉద్యమంలో బాపూజీ పెద్ద దిక్కుగా ఉంటూ వచ్చారు. తెలంగాణ ఉద్యమం ఓట్లు, సీట్లకు పరిమితమై రాజీ ధోరణితో నడుస్తూ, నిరాశ నిస్పృహలతో జనం ఈసురోమంటున్న దశలో కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రజలలో భవిషత్ పై ఆశలను చిగురింపజేశారు.

దేశానికి స్వాతంత్రం వచ్చి తెలంగాణ ఇండియాలో కలిసిన తర్వాత కొండా లక్ష్మణ్ ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ నుండి 1952 లో తొలిసారిగా ఎమ్మెల్యే గా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీలో 23 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్ గా, మంత్రిగా విశేష సేవలు అందిచడమే కాకుండా దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా స్వంత పార్టీని సైతం ఎదిరించి బహుజన, శ్రామిక వర్గాల పక్షాన నిలబడిన పక్షపాతి బాపూజి. 1969 లో మొదలైన తొలి దశ తెలంగాణ ఉద్యమమానికి మద్దతుగా తన మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమానికి అండగా నిలిచారు. బి.సి లకు మేలు చేసే బి.పి మండల్ కమీషన్ నివేదికకు వ్యతిరేకంగా పార్లమెంటులో రాజీవ్ గాంధీ మాట్లాడినందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేసి వెనుకబడిన తరగతులకు అండగా నిలిచి సామాజిక మూలలను వీడని గొప్ప నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షపై అమితంగా ఆలోచించే బాపూజీ 2001 లో టిఆర్ఎస్ పార్టీ ఏర్పడినప్పుడు తన ఇల్లునే పార్టీ కేంద్ర కార్యాలయానికి అందించిన సహృదయ సౌజన్య శీలి. తెలంగాణకు పచ్చి వ్యతిరేకి అయిన చంద్రబాబు బాపూజిపై కక్ష కట్టి ఆయన లేని సమయంలో ఆయన ఇంటిని నేల మట్టం చేశారు. ఆ భవనంలోని అన్ని రికార్డులను, స్థిర, చర ఆస్తులను నిరంకుశంగా ప్రభుత్వాదికారులు తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఏక నాయకత్వం పనికిరాదని సమిష్టి నాయకత్వం మాత్రమే ఆశయసిద్ధికి దోహదం చేస్తుందని వెలుగెత్తి చాటిన బాపూజీ విద్యార్థి, యువజనులను చైతన్యం చేసి తన 96 ఏండ్ల వయస్సులో సైతం తెలంగాణ కోసం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద దీక్ష చేసి తెలంగాణ ఉద్యమంలో సామాజికతను జోడించారు.

ఉర్దూ, మరాఠీ భాషల్లో పాఠశాల విద్యను కొనసాగించిన కొండా లక్ష్మణ్ గాంధీని ఎవరు కలవకూడదని ఆంక్షలు ఉన్నప్పటికీ తన పదహారేళ్ళ వయసులో కొంతమంది విద్యార్థులను వెంటబెట్టుకొని చంద్రాపూర్ లో గాంధీని కలుసుకొని స్వతంత్ర ఉద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. చిన్నతనంలోనే కొండా యువకులను వెంటబెట్టుకొని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారు. తన ఆందోళనల ద్వారా పేదల ఇనాం భూములు తిరిగి వచ్చేలా చేయడంతో భూస్వాములు కొండాను తిరుగుబాటుదారునిగా చూసారు. హైదరాబాద్ సిటీ కళాశాలలో విద్యనభ్యసించిన కొండా 1938 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన వందేమాతరం ఉద్యమంలో పాల్గొని జైలు పాలయ్యారు. జాతీయ ఉద్యమంలో యువకులు చేరడం కోసం తన 20 ఏండ్ల వయస్సు నుండే యువకులకు రహస్యంగా శిక్షణ ఇచ్చేవారు. 1938 లో నిజాం పాలనలో పౌర హక్కుల సాధన కొరకు హైదరాబాద్ లో కాంగ్రెస్ సత్యాగ్రహం, హిందూ మహాసభ, ఆర్య సమాజం చేసిన పోరాటంలో పాల్గొని కొండా అరెస్ట్ అయ్యారు.

పదవ తరగతి పాసైన కొండా ఆర్థిక ఇబ్బందుల వల్ల కళాశాల విద్యను మానేసి సాయంకాలం పూట హైకోర్టు నడిపే రెండు సంవత్సరాల న్యాయవాద వృత్తి కోర్సులో చేరి న్యాయవాది అయ్యాడు. న్యాయవాదిగా నిజాం కు వ్యతిరేకంగా పోరాడే వారి తరువున వాదించి కేసులు గెలిపించి సేవలు అందిచారు. ఆనాటి ఉద్యమకారులైన చాకలి ఐలమ్మ, బందగి లాంటి వాళ్లకు న్యాయ సహాయం అందించాడు. డెహ్రాడూన్ లో 1940 లో నిర్వహించిన రాజకీయ శిక్షణకు హాజరై "రెవల్యూషనరీ ఇష్యూస్ ఆఫ్ ఇండియా" అనే అంశంపై ఎం.ఎన్.రాయ్ చేసిన ఉపన్యాసం విని బాపూజీ చాలా ప్రభావితుడయ్యాడు. స్వాతంత్ర పోరాట సమయంలో షోలాపూర్ లో సుభాష్ చంద్రబోస్ ను కలిసి నిజాం నిరంకుశత్వంపై చర్చించారు. రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న కొండా ఇంటిని 1941 లో పోలీసులు ముట్టడించారు. పోలీసుల నుండి తప్పించుకొని కొంతకాలం అజ్ఞాతంలో ఉండి కూడా నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమం చేసాడు. హైదరాబాద్ నుండి బొంబాయి లోని కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్ళి "జాయిన్ ఇండియా" ఉద్యమంలో చురుగ్గా పాల్గొనడమే కాకుండా నిజాం రాజ్యం నుండి వచ్చే శరణార్థుల బాగోగులు చూసారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ 1941 లో ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో కిసాన్ సదస్సు ఏర్పాటు చేసి జాతీయ నాయకులు జయప్రకాష్ నారాయణ, ఎన్.జి. రంగా వంటి వారిని ఆహ్వానించారు. 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంతో పాటు తెలంగాణ విమోచన ఉద్యమంలో పాల్గొన్న కొండా బ్రిటిష్ రెసిమెంట్ ప్రాంగణం, టెలిగ్రాఫ్ కార్యాలయం ఇతర చోట్ల కాంగ్రెస్ పతాకాన్ని ఎగురవేశారు. నిజాం నిరంకుశ పాలన నుండి సామాన్యులను రక్షించడం కోసం హైదరాబాద్ లోని అనేక ప్రాంతంల్లో పౌర రక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. 1942 లో ఏర్పడిన ఆంధ్ర మహాసభతో అనుబంధం పెంచుకున్న కొండా రావి నారాయణ రెడ్డి, బద్ధం ఎల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రరెడ్డిలతో కలిసి ఉద్యమంలో పాల్గొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత చేనేత రంగం దెబ్బతినడంతో బాపూజీ పెద్ద ఉద్యమం చేసి యార్న్ కూపన్ పద్ధతిని నిజాం ప్రభుత్వంలో పెట్టించగలిగారు. నిజాం కాలంలో ఉన్న నిర్బంధ వెట్టి చాకిరి గెజిట్ నోటిఫికేషన్ కు వ్యతిరేకంగా బాపూజీ ఉద్యమం చేసి మత్యకారులు, మంగలి, చాకలి, కుమ్మరి, చేనేత కార్మికుల నిర్బంధ ఉచిత సేవల విముక్తి కోసం పోరాటం చేసి విజయం సాధించాడు. 1945 లో నిజాం రాష్ట్ర పద్మశాలి సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన కొండా నిజాం దౌర్జన్యాలను అరికట్టడం కోసం సాయుధ దళాలను ఏర్పాటు చేయలనుకున్నాడు. నిజాం రాష్ట్రాన్ని ఇండియన్ యూనియన్ లో కలపడానికి జరిగిన ప్రయత్నాల్లో కీలకపాత్ర పోషించిన కొండాను 1947 లో నిజాం పోలీసులు అరెస్ట్ చేయడానికి ప్రయతించగా రహస్య జీవితంలోకి వెళ్లి రైల్వే స్టేషన్లు, పోలీస్ స్టేషన్లపైన బాంబులు వేయడమే కాకుండా 1947 డిసెంబర్ 4 న నిజాం నవాబుపై కూడా బాంబు దాడి చేసిన బృందంలో కొండా పాల్గొన్నారు. బాంబు దాడిలో పాల్గొన్న పవార్ ను అరెస్ట్ చేసిన నిజాం పోలీసులు కొండాను అరెస్ట్ చేయలని చూస్తే దొరకకుండా బొంబాయి వెళ్లారు. ఈ కేసులో అనేకమంది కొండా లక్ష్మణ్ స్నేహితులను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. తెలంగాణను ఇండియాలో కలిపిన తర్వాత కొండా లక్ష్మణ్ పై ఉన్న కేసులన్ని ఎత్తివేశారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదం, నిజాం నిరంకుశ పాలనను ఎదుర్కొనేందుకు పరస్పర విరుద్ధమైన సుభాష్ చంద్రబోస్ అతివాద ధోరణి, గాంధీ సామ్యవాద ఆలోచన ధోరణిని అనే రెండు ఆయుధాలను బాపూజీ సమయోచితంగా వాడుకున్నాడు. బాపూజీ చేపట్టిన అనేక ఉద్యమాల్లో తండ్రి పోశెట్టి నుండి నేర్చుకున్న క్రమశిక్షణ, తిలక్, ఎం.ఎస్ రాయ్, సుబాష్ చంద్రబోస్ ల నుండి నేర్చుకున్న ప్రగతిశీల భావాల ప్రభావం కనపడుతుంది. కులం, వర్గం, వంశపారంపర్యం ప్రాతిపదికగా సమకూరే గౌరవాలను నిరసించిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ. ప్రజాస్వామ్య స్ఫూర్తిని అందించే భారత రాజ్యాంగం, అంబేద్కర్ ఆలోచన ప్రభావం బాపూజీపై కనిపించేది.

సంఘ సంస్కరణ ఉద్యమాల్లో భాగంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో బిల్లు పెట్టడం కోసం బాపూజీ జంట నగరాల్లో అనేక నిరసనలు చేపట్టారు. పద్మశాలి హాస్టల్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన కొండా 1949 లో ప్రభుత్వం చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేసారు. 1944 నుండి 1960 వరకు రాష్ట్ర పద్మశాలి అధ్యక్షుడిగా, 1951 నుండి 1956 వరకు రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంఘానికి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన కొండా నిరంతర కృషి వల్లనే హైదరాబాద్ రాష్ట్రం చేనేత వృత్తి నిర్వహించే 15 కులాలకు విద్యా సదుపాయాలు కల్పించేందుకు వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చింది. బాపూజీ ఎన్నో గౌరవాలు పొందారు. "ఆచార్య" అనే బిరుదు తన సేవల నుండే వచ్చింది. "సహకార రత్న" గా పేరుగాంచారు. 2005 ఆగస్టు 9 న భారత రాష్ట్రపతి "ఎమినెంట్ ఫ్రీడం ఫైటర్" అవార్డు ఇచ్చారు. సత్యాగ్రమం నూరేళ్ళ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యులుగా ఎంపికయ్యారు. 2007 లో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్ కమిటీకి చైర్మన్ గా నియమించబడ్డాడు. బాపూజీ 2010 లో ఆదిలాబాద్ జిల్లా వాంకిడి లో కొండా లక్ష్మణ్ బాపూజీ సేవా సధన్ ప్రారంభించి గిరిజనులకు సేవ చేయడానికి 25 లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు. బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితమంతా పోరాడిన కొండా జనాభాలో అత్యధిక శాతం ఉన్న వెనుకబడిన తరగతుల సామాజిక న్యాయ ఉద్యమం కోసం వారి సంక్షేమం కోసం బి.సి వెల్ఫేర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి దానికి 25 లక్షల మూల ధనాన్ని అందించారు. ఇంకొక మాటలో చెప్పాలంటే దక్షిణాదిన తమిళనాడులో ఉద్యమం చేసిన పెరియార్ తర్వాత కొండా లక్ష్మణ్ బాపూజీ అని చెప్పాలి. పెరియార్ ఉద్యమ వారసులు ఆయన స్ఫూర్తితో తమిళనాడులో బాహుజన రాజ్యం స్థాపిస్తే ఎన్నో పోరాటాల చరిత్ర కలిగిన తెలంగాణలో మాత్రం రెండు సార్లు దురాక్రమణకు గురై నేటికి నిరంకుశ పాలన కొనసాగుతూ మెజార్టీ ప్రజలైన అణగారిన వర్గాలను శ్రమ దోపిడి చేస్తున్నారు.

విలక్షణ వ్యక్తిత్వం గల బాపూజీ స్వాతంత్రం, న్యాయం, సమానత్వం సాధించేందుకు అలుపెరుగని సామాజిక, రాజకీయ పోరాటం చేసిన గొప్ప వ్యక్తి. తన రహస్య జీవితంలోనే మద్రాస్ లో 1948 జూన్ 27 న డాక్టర్ శకుంతలాదేవితో బాపూజి కి వివాహం జరిగింది. చైనా యుద్ధం క్షతగాత్రులకు భార్య శకుంతలాదేవిని వెళ్లి సేవలు చేయమని ప్రోత్సహించారు. బాపూజీ ఇద్దరి కుమారులలో ఒకరు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో చేరి అసువులు బాసారు. నిజాం రాజ్యం ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ తాలూకాలోని మారుమూల గ్రామం వాంకిడిలో కొండా పోశెట్టి, అమ్మక్కలకు 1915 సెప్టెంబర్ 27 న జన్మించిన బాపూజీ 97 సంవత్సరాలు జీవించి 2012, సెప్టెంబర్ 21 న తుదిశ్వాస విడిచారు. పీడిత ప్రజల విముక్తి కోసం బహుముఖ పోరాటం చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నేటి తరం యువతకు ఆదర్శం కావాలి.

బాపూజీ తన జీవితకాలంలో ఎంతో మంది మహనీయులతో సత్సంబంధాలు కొనసాగించారు. నెహ్రూ, లాల్ బహుదూర్ శాస్త్రి, సర్వేపల్లి రాధాకృష్ణ, ఇందిరాగాంధీ, కామరాజ్ నాడార్, నిజలింగప్ప, మొరార్జీ దేశాయ్, టంగుటూరి అంజయ్య, కె.వి. రంగారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, రాజీవ్ గాంధీ, సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్ లాంటి నాయకులతో సత్సంబంధాలు కొనసాగించారు. పీడిత ప్రజల పక్షాన జీవితాంతం పోరాటం చేసిన బాపూజి పేరు రాష్ట్ర ముఖ్యమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలనలో ఉందనే సంగతి తెలుసుకున్న ఆనాటి అగ్రకుల నాయకులు ఒక్కటై రాజకీయంగా ఆయనను ఒంటరిని చేశారు. నేటికి తెలంగాణలో బి.సి ముఖ్యమంత్రి డిమాండ్ కొనసాగుతుంది. తొమ్మిది దశాబ్దాల తెలంగాణ సామాజిక చరిత్ర, ఉద్యమాలు, సామాజిక, ఆర్థిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వానికి సంబంధించిన అనేక పరిణామాలు కొండా జీవితంతో ముడిపడి ఉన్నాయి. బాపూజీ వంటి వ్యక్తిత్వం, సౌశీల్యం, సంకల్ప బలం, త్యాగశీలత, నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయం. విద్యారంగంలో జరిగిన కృషితో ఉద్యోగాల్లో ప్రవేశించిన ఉద్యోగులు వ్యక్తిగత అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వకుండా, రాజకీయాల్లో ఎదిగిన వారు దళారులుగా మారకుండా కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి మహనీయుల అడుగుజాడల్లో పయనించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి.

సాయుధ పోరాటం మొదలుకొని 2014 లో తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ఎందరో మహానుభావులు, సామాన్యులు త్యాగం చేసారు. అలాంటి త్యాగధనులను గుర్తించి వారి చరిత్రను సమాజానికి తెలియజెప్పాల్సిన బాధ్యత మరిచిన టిఆర్ఎస్ పార్టీ త్యాగధనుల చరిత్రను కనుమరుగు చేయడానికి తెలంగాణ తల్లి విగ్రహాలను ఊరూరా పెట్టిస్తున్నారు. సామాజిక పోరాటాల ఉధృతి గమనించిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఇటీవల చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజి జయంతులను ప్రభుత్వం అధికారికంగా జరపాలని నిర్ణయించడం సంతోషకరం. మొక్కుబడిగా జయంతి కార్యక్రమాలు చేసే పాలకులు చిత్తశుద్ధితో మహనీయులు కలలు కన్న తెలంగాణ కోసం కృషి చేయాలి. లేని పక్షంలో త్యాగధనులు కోరుకున్న సబ్బండ వర్గాలు విముక్తి చెందే సంపూర్ణ తెలంగాణ కోసం ప్రజలు మరో పోరాటానికి సిద్ధమవుతారు. కొండా స్ఫూర్తితో బి.సి ల హక్కుల కోసం, బి.సి ల అభివృద్ధికి దోహదం చేసే బి.సి కులాల జనగణన, చట్టసభల్లో బి.సి లకు రిజర్వేషన్లు, మహిళా బిల్లులో బి.సి లకు రిజ్వేషన్లు, క్రిమీలేయర్ తొలగింపు, రిజర్వేషన్లపై సీలింగ్ ఎత్తివేత, న్యాయ విభాగంలో బి.సి రిజ్వేషన్ల కోసం పోరాటం చేయాలి.

(సెప్టెంబర్ 27 ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111 వ జయంతి సందర్భంగా)



సాయిని నరేందర్ న్యాయవాది రాజకీయ, సామాజిక విశ్లేషకులు,9701916091

# ఎమ్మెల్యే సారు....మా గోడు(పోడు)వినండి.

**పినపాక, సెప్టెంబర్ 26(భద్రాద్రి న్యూస్ ):**

నాడు అరకపట్టి దున్నిన నేటి ఎమ్మెల్యే పాయం... 20 సంవత్సరాలుగా రైతుల రక్తంతో తడుస్తున్న పోడు భూమి. రాజులు మారిన రాజ్యాలు మారనట్లుగా పెంటన్నగూడెం – బొమ్మరాజు పల్లి గ్రామాల పోడు వివాదాన్ని ఎవరు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవట్లేదు. ఎన్నికలు జరగటం ,ప్రభుత్వాలు మారటం ముఖ్యమంత్రులు పోడు భూములకు పట్టాలిస్తాము అధికారికంగా గుర్తిస్తామని వాగ్దానాలు చేస్తూ వారి అధికార దాహాన్ని తీర్చుకుంటున్నారు తప్ప రెండు గ్రామాల పోడు సమస్యలను గుర్తించట్లేదని పోడు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా పెంటన్నగూడెం – బొమ్మరాజు పల్లి గ్రామాల మధ్య పోడు సమస్య అనేక ఉద్రిక్తతల, వివాదాల నడుమ అనేక సంవత్సరాలుగా పోడు రైతుల రక్తంతో నెత్తురోడుతున్న కూడా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం, అధికారులు స్పందించి సమస్యని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. – ఎమ్మెల్యే పాయం నాడు అరకపట్టి దున్నిన భూమి :25 హెక్టార్ల భూమిని పోడు కొట్టుకున్న రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటానని నేటి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆనాడున సిపిఎం పార్టీలో ఉండి రైతుల సమక్షంలో అరక పట్టి పోడు భూమిని దున్నడం జరిగింది. 20 సంవత్సరాలుగా వివాదాల నడుమ కొనసాగుతున్న ఈ పోడు భూమి సమస్య ఎమ్మెల్యే పాయం దృష్టిలో ఎప్పటినుంచో ఉంది. ప్రభుత్వం ద్వారా అధికారుల సహకారంతో రెండు గ్రామాల రైతుల పోడు సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.– గిరిజనులకు వ్యతిరేకం కాదు: పెంటన్నగూడెం గ్రామస్తులు.రెండు గ్రామాల మధ్య నలుగుతున్న ఈ పోడు సమస్యను కులాల మధ్య చిచ్చుగా పరిగణించవద్దని... ఎట్టి పరిస్థితుల్లో గిరిజనులకు మేము వ్యతిరేకం కాదన్న పెంటన్నగూడెం గ్రామస్తుల వాదనను పరిగణలోకి తీసుకొని .. పోడు భూమిని చదును చేసుకున్న రైతుల వివరాలు ఆధారంగా గిరిజన రైతులకు, హరిజన రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇప్పించి తమ జీవనాధారాన్ని దూరం చేయకుండా పోడు రైతుల సమస్యను తీర్చాలని రెండు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.– కార్పొరేషన్ డిపార్ట్ కేసులు...! అధికారులకు విన్నపాలు...! కార్పొరేషన్ డిపార్ట్ కు సంబదించిన దమ్మక్కపేట బీట్ లో ఉన్న 25 హెక్టార్ల భూమిని పెంటన్నగూడెం –బొమ్మరాజు పల్లి గ్రామాల రైతులు పోడు భూమి నరికి,నాగల్లు దున్నడం, పోడు భూమిలో గుడిసెలు వేయటం అటవీ శాఖ అధికారులు కూలగొట్టడం జరిగింది. వ్యవసాయం చ్ఛసే పోడు రైతులకు అధికారుల తీరు సమస్యగా మారింది. ఎంతో కష్టపడి సాగు చేసుకుంటున్నా... పోడు భూమిపై కార్పొరేషన్ అధికారులు పలుమార్లు రైతులపై దాడి చేసి కేసులు పెట్టడం జరిగింది. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగటం ఆ రెండు గ్రామ ప్రజలకు అలవాటుగా మారింది.పోడు సమస్య పరిష్కారం దిశగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అధికారుల సహకారంతో పట్టాలి ఇప్పించాలని ముక్తకంఠంతో రెండు గ్రామ ప్రజల పోడు రైతులు వేడుకుంటున్నారు.




# ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

**– ఆల్ ఇండియా ఎస్సీ/ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ**



**పాల్వంచ, సెప్టెంబర్ 26(భద్రాద్రి న్యూస్):**

గత 65 సంవత్సరాలుగా ఆల్ ఇండియా ఎస్సీ/ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ (ూ×ూజుూూ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో పోరాటాలు చేస్తూ గుర్తింపు పొందిందని సొసైటీ ప్రతినిధులు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. ?గత 36 ఏళ్లుగా ఉన్న కాంట్రాక్ట్ లేబర్ చట్టంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం మరియు అంబేద్కర్ భవన్ నిర్మాణం కొరకు ఎకరం భూమి సాధించటం జరిగిందని.

**జిల్లా ఇన్‌ఛార్జ్‌గా కాల్వ భాస్కర్ రావు నియామకం:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌ఛార్జ్‌గా శ్రీ కాల్వ భాస్కర్ రావును నియమించినట్లు వెల్లడించారు. జిల్లాలోని అన్ని మండలాలు, బ్రాంచ్‌లలో మెంబర్‌షిప్ డ్రైవ్‌ను వేగవంతం చేసి, వచ్చే నెల 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆయనకు సూచించారు. అలాగే పాల్వంచ నూతన కమిటీ నియామక బాధ్యతలను కాల్వ భాస్కర్ రావుకు అప్పగిస్తూ, కమిటీలలో యువతకు, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

**ప్రభుత్వానికి పలు డిమాండ్లు:** 22ూ భూముల సమస్య: కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 22ూ నిషేధిత భూములను గుర్తించి పరిష్కరిస్తామని చెప్పడం ఆహ్వానించదగ్గ పరిణామమని, వెంటనే 3 లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై విచారణ జరిపి ఎస్సీ, ఎస్టీ మరియు నిరుపేద రైతులకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. **KTPS** లో రెండు యూనిట్ల ఏర్పాటు: ఖూూ లో రద్దు చేసిన 8 యూనిట్ల స్థానంలో వెంటనే 2 800ట వీఔఉ నూతన యూనిట్లను నిర్మించాలని, లేనిపక్షంలో ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. టిజి జెన్‌కో ఇన్‌ఛార్జ్ నియామకం: రిటైర్డ్ జేఏఓ శ్రీ కొలిపాక ఆనంద్ రావును టిజి జెన్‌కో **(TG GENCO)** ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు.

?ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎర్మాల శివరాజ్ రాసూరి చంద్రశేఖర్ , కాల్వ భాస్కర్ రావు, కాల్వ ప్రకాష్ రావు, ఎం .రాజేంద్ర కుమార్, వాసిముల్ల సుందర్ రావు, కాసిముల్ల ఆనందరావు,కాల్వ రామారావు, కాలే పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలికి ఆర్థిక చేయూతనందించిన వైరా ఎస్సై పుష్పాల రామారావు .





**వైరా, సెప్టెంబర్ 26,( భద్రాద్రి న్యూస్ ) :** వైరా నియోజకవర్గంలోని పాలడుగు గ్రామానికి చెందిన వృద్ధురాలు మోదుగు చుక్కమ్మ కు శిధిలావస్థలో ఉన్న ఇంటి పునర్నిర్మాణానికి వైరా ఎస్సై పుష్పాల రామారావు 20వేల రూపాయల ఇంటికి అవసరమైన మెటీరియల్ ను అందించారు. చుక్కమ్మ ఇంటి పరిస్థితులు తెలుసుకున్న ఎస్సై రామారావు మానవతా దృక్పథంతో స్పందించి ఆ ఇంటి రిపేర్ కోసం అవసరమైన ఇసుకను , సిమెంటును అందించి ఇల్లు బాగు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. గతంలో తమ ఇంటిలోకి విష సర్పాలు, కోతులు, క్రిమి కీటకాదులు , ఎలుకలు వచ్చి తమను ఇబ్బంది పెడుతున్న పరిస్థితుల్లో వైరా ఎస్సై రామారావు స్పందించి మెటీరియల్ అందించడంతో తమ ఇంటిని బాగు చేసుకున్నామని వృద్ధురాలు చుక్కమ్మ ఆనందాన్ని వ్యక్తం చేసింది. శనివారం ఎస్సై పుష్పాల రామారావు పాలడుగు గ్రామంలోని వృద్ధురాలు చుక్కమ్మ ఇంటికి వచ్చి ఇంటి పునర్నిర్మాణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి ఆర్థిక చేయూత అందించాలని కోరారు. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచి ఆర్థిక చేయూత అందించినప్పుడు బాధితుల సంతోషానికి అవధులు లేకుండా పోతుందని తెలియజేశారు. తమ గృహానికి వచ్చి అండగా నిలిచిన వైరా ఎస్సై పుష్పాల రామారావు ను వృద్ధురాలు చుక్కమ్మ, కుమారుడు గోవిందరావు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వృద్ధురాలు మోదుగు చుక్కమ్మ, పాలడుగు గ్రామ సర్పంచ్ గద్దల నరసింహారావు, గ్రామ కాలనీ పెద్దలు మోదుగు జానయ్య, జర్నలిస్టులు ఏపూరి రాజారావు, అక్కిశెట్టి రవితేజ, మహేష్, మోదుగు గోవిందరావు , కాలనీ పెద్దలు పాల్గొన్నారు. వైరా ఎస్ ఐ పుష్పాల రామారావు స్వచ్ఛందంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఉద్యోగరీత్యా పోలీస్ డిపార్ట్మెంట్లో విధులను నిర్వహిస్తూ ఎస్సై రామారావు మిగతా సమయంలో అమ్మానాన్న ట్రస్టు ద్వారా కాళ్లు లేనోళ్లకు కృత్రిమ కాళ్లను అందిస్తూ, చదువుకునే పేద విద్యార్థిని విద్యార్థులకు, ఫీజులు, పుస్తకాలు, ఫ్యాడ్లు, విద్యా వనరులకు చేయూతనందిస్తూ , అదేవిధంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు తన ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ అటు లా అండ్ ఆర్డర్ ను సక్రమంగా విధులను నిర్వహిస్తూ, ఇటు సామాజిక సేవా కార్యక్రమాల్లో తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. మానవతా దృక్పథంతో బాధితుల కష్టాలకు వెంటనే స్పందించి తానునున్నానంటూ అండగా నిలుస్తున్న వైరా ఎస్సై పుష్పాల రామారావు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

# మున్సిపల్ షాపుల మాటున అక్రమ దందా!

**- రూ.90 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు చేతులు మారుతున్న షాపులు?**

**- ఏడాదికి రూ.3,600 పన్ను.. నెలకు రూ.6 వేల వరకు అద్దె!**




**పాల్వంచ, సెప్టెంబర్26 (భద్రాద్రి న్యూస్):** ప్రజలకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేటాయించిన మున్సిపల్ షాపులు కొందరికి అక్రమ ఆదాయ వనరులుగా మారుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. మున్సిపాలిటీకి క్రమం తప్పకుండా పన్నులు చెల్లించాల్సిన షాపులను కొందరు కేటాయింపుదారులు ఇతరులకు రూ. 90 వేల నుంచి రూ. 1.50 లక్షల వరకు విక్రయించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు ఒకే షాపును పలుమార్లు ఇతరులకు విక్రయిస్తూ రూ. 6. 80 లక్షలకు పైగా అక్రమంగా ఆర్జించినట్లు సమాచారం. మరోవైపు మున్సిపాలిటీకి ఏడాదికి చెల్లించే పన్ను సుమారు రూ. 3,600 మాత్రమే ఉండగా, అదే షాపులను నెలకు రూ. 5 వేల నుంచి రూ. 6 వేల వరకు అద్దెకు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఒకరి పేరుతో రెండు, మూడు షాపులు కేటాయించబడినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు కేటాయింపుదారులు వ్యాపారం చేయకుండా ఇతరులకు అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారని, దీంతో నిజంగా స్వయం ఉపాధి అవసరమైన చిన్న వ్యాపారులకు అన్యాయం జరుగుతోందని స్థానికులు అంటున్నారు.
మున్సిపల్ షాపులు ప్రజా ప్రయోజనం కోసమా.. లేక కొందరి వ్యక్తిగత ఆదాయం కోసమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

# గోదావరి ఉగ్రరూపం.. లంకలో 185 మంది కూలీలు బందీలు!





**- మిరప తోటల్లో చిక్కుకున్న వ్యవసాయ కూలీల్లో ఆందోళన.. పడవలతో సాహసోపేతంగా తరలింపు । ముందస్తు అప్రమత్తత చర్యలు ఎక్కడ?**

**చర్ల, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్):** గోదావరి వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో చర్ల మండలంలో తీవ్ర ఆందోళనకర పరిస్థితి నెలకొంది. మొగళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గోదావరి లంక ప్రాంతంలో మిరప మొక్కలు నాటేందుకు వెళ్లిన సుమారు 185 మంది వ్యవసాయ కూలీలు వరద నీటిలో చిక్కుకుపోయారు. నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో లంక నుంచి బయటకు వచ్చే మార్గం లేక కూలీలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**వరద పెరుగుతున్నా.. లంకలోనే కూలీలు!**

గోదావరిలో నీటి ప్రవాహం పెరుగుతున్న సమయంలోనూ లంక ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లడం, పరిస్థితి విషమించే వరకు వారు అక్కడే ఉండిపోవడం ఆందోళన కలిగించింది. వరద ఉధృతి మరింత పెరిగితే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉండటంతో కూలీల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

**రైతే ముందుకొచ్చి.. పడవతో రక్షణ చర్యలు**

కూలీలు వరదలో చిక్కుకున్న విషయం తెలుసుకున్న ఓ రైతు వెంటనే పడవతో లంక ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ చిక్కుకున్న కూలీలను ఒక్కొక్కరినీ పడవలోకి ఎక్కిస్తూ సురక్షితంగా ఒడ్డుకు తరలించే ప్రయత్నం ప్రారంభించాడు. సమాచారం అధికారులకు చేరడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు. అదనపు పడవలను ఏర్పాటు చేసి సహాయక చర్యలను ముమ్మరం చేశారు. దశలవారీగా లంకలో చిక్కుకున్న వారిని ఒడ్డుకు తరలించారు.

**185 మంది సురక్షితం.. కానీ ముందస్తు అప్రమత్తతపై ప్రశ్నలు!**

చివరకు సుమారు 185 మంది కూలీలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో కూలీలు, వారి కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న సమయంలో లంక ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు వెళ్లే కూలీల విషయంలో ముందస్తు హెచ్చరికలు, పర్యవేక్షణ చర్యలు ఎంతవరకు జరిగాయి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వరదలు వచ్చిన ప్రతిసారీ లంక ప్రాంతాల్లో ప్రమాదాలు పొంచి ఉన్నప్పటికీ, ముందుగానే కూలీలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఇకనైనా అధికారులు మేల్కొనాలి!**

గోదావరిలో వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో లంక ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. వరద ఉధృతి పెరిగిన తర్వాత రక్షణ చర్యలు చేపట్టడం కంటే.. ప్రమాదం రాకముందే అప్రమత్తం చేయడమే అసలు ముందస్తు చర్య. లంకల్లోకి వెళ్లే కూలీల వివరాలను ముందుగానే సేకరించి, పరిస్థితులకు అనుగుణంగా వారిని వెనక్కి రప్పించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ ఘటనలో పెను ప్రమాదం తప్పినప్పటికీ, అధికార యంత్రాంగం ఇకనైనా లంక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టి, వరదల సమయంలో కూలీల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# చిన్నారుల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

***– బాలికల సదనంలో మేజిస్ట్రేట్ ఆకస్మిక తనిఖీ***



**మణుగూరు, సెప్టెంబర్ 26(భద్రాద్రి న్యూస్):** మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి శనివారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం బాలికల సదనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సదనంలోని గదులు, వంటగది, ఆవరణ, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో మేజిస్ట్రేట్ ముచ్చటించి భోజనం, వైద్యం, విద్య, తాగునీరు, భద్రత తదితర సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి అవసరమైన వైద్య పరీక్షలను సకాలంలో నిర్వహించాలని సదనం నిర్వాహకులకు సూచించారు. చిన్నారులు చదువుపై శ్రద్ధ పెట్టి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని మేజిస్ట్రేట్ సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే సదనం నిర్వాహకులు, సంబంధిత అధికారులు లేదా న్యాయ సేవా సంస్థల దృష్టికి తీసుకురావాలని, బాలల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవా సంస్థలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. సదనంలో చిన్నారులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పిస్తూ వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం బాలికలకు మేజిస్ట్రేట్ స్వయంగా భోజన పదార్థాలను వడ్డించి, ఆహారం రుచిగా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సదనం చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి దీప్తి రాణి, న్యాయవాది అంకం సర్వేశ్, లీగల్ సెల్ కోఆర్డినేటర్ రవీందర్, సదనం అసిస్టెంట్ కుమారి, కోర్టు కానిస్టేబుల్ బుచ్చిబాబు, హోంగార్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ



**వైరా, సెప్టెంబర్ 26, (భద్రాద్రి న్యూస్ ) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ఆరవ వార్డులోని అంగన్వాడీ కేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు అంగన్వాడీ కేంద్రంలోని వసతులు, పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు, పిల్లల సంరక్షణ, పోషకాహారం, మౌలిక వసతులపై సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం విషయాలను అడిగి తెలుసుకున్నారు, పిల్లలు డ్రెస్ విషయంలో కూడా శ్రద్ధ వహించి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఎంతమంది పిల్లలు ఉన్నారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆరో వార్డులో ఉన్న డ్రైన్ కొలతలు వేయించి దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు లగడపాటి ప్రభాకర్ రావు, తోటకూర శ్రీకాంత్, మున్సిపల్ వర్కర్ గజ్జల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మోకాళ్లపై కూర్చొని న్యాయం అడిగిన ఆదివాసీ రైతులు!

**- ఐదో రోజుకు చేరిన దీక్షలు.. కదిలిన రెవెన్యూ యంత్రాంగం.. పంచనామా నివేదికతో దీక్ష విరమణ**






**వాజేడు, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్):** మా భూములు మాకే దక్కాలి.. మా హక్కులను కాపాడాలి” అంటూ ఆదివాసీ రైతులు మోకాళ్లపై కూర్చొని న్యాయం కోసం నిరసనకు దిగిన ఘటన వాజేడు మండలంలో తీవ్ర చర్చకు దారితీసింది. ఐదు రోజులుగా దీక్షలు కొనసాగుతున్నా స్పందన కనిపించకపోవడంతో చివరకు రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఆదివాసీ నవనిర్మాణ సేన (ఏఎన్ఎస్) ఆధ్వర్యంలో ఎడజర్లపల్లి ఆదివాసీ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. తమ భూముల సమస్య పరిష్కారం కోసం రోజులు తరబడి అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, చివరకు మోకాళ్లపై కూర్చొని న్యాయం అడగాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**“ఆదివాసీ భూముల రక్షణలో ఎందుకింత నిర్లక్ష్యం?”**

తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు, ఆదివాసీ సంఘాల నాయకులు నినాదాలు చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీల భూముల పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నప్పటికీ, తమ భూముల విషయంలో స్పష్టత కోసం రైతులు ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని వారు ప్రశ్నించారు. ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సింహమూర్తి మాట్లాడుతూ.. ఆదివాసీల భూములకు చట్టపరమైన రక్షణ ఉన్నప్పటికీ, ఆ హక్కుల కోసం అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని అన్నారు. ఆదివాసీ రైతుల భూముల సమస్యను రికార్డుల ఆధారంగా సమగ్రంగా పరిశీలించి, న్యాయబద్ధంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ.. ఆదివాసీ భూముల విషయంలో రెవెన్యూ అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతుల ఫిర్యాదులను పెండింగ్లో ఉంచకుండా రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఎస్పీ జిల్లా అధ్యక్షుడు పర్షిక సతీష్ మాట్లాడుతూ.. ఎడజర్లపల్లి ఆదివాసీ రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఆదివాసీలకు కేటాయించిన అసైన్డ్ భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లకుండా రెవెన్యూ అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆదివాసీల భూములపై వస్తున్న ఆరోపణలను సమగ్రంగా విచారించి, భూముల రికార్డులను కాపాడాలని డిమాండ్ చేశారు.

**ఐదు రోజుల ఆందోళనకు ఫలితం.. రంగంలోకి దిగిన అధికారులు**

రైతుల ఆందోళన ఉధృతం కావడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, దేవులపుట్ తహసీల్దార్ రాము ఎడజర్లపల్లి ప్రాంతానికి సంబంధించిన భూ రికార్డులను పరిశీలించారు. గిరిజన రైతులకు సంబంధించిన అసైన్డ్ భూముల వివరాలను పరిశీలించి పంచనామా నిర్వహించారు. అనంతరం పంచనామా నివేదికను రైతులకు అందజేశారు. గిరిజనుల భూములు గిరిజనులకే చెందాలని, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వర్తించే 1/70 చట్ట నిబంధనల ప్రకారం గిరిజనుల భూములను గిరిజనేతరులకు బదలాయించడం చెల్లదని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. గిరిజన రైతుల పట్టా భూముల్లోకి ఇతరులు వెళ్లకుండా సంబంధిత వ్యక్తికి సూచించినట్లు వెల్లడించారు.

**నివేదిక అందడంతో దీక్ష విరమణ**

ఐదు రోజుల పాటు ఆందోళన కొనసాగించిన రైతులకు అధికారులు రికార్డుల పరిశీలన, పంచనామా నివేదిక అందజేయడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావు రైతులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

**ఆదివాసీ సంఘాల అండ.. భూముల రక్షణకు ఉద్యమం**

ఐదో రోజు దీక్షలకు జీఎస్పీ, ఏఎస్పీ, తుడుందెబ్బ తదితర ఆదివాసీ సంఘాలు మద్దతు తెలిపాయి. కార్యక్రమంలో ఏఎన్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్, వాజేడు మండల అధ్యక్షుడు మోడెం నాగరాజు, ఉపాధ్యక్షుడు యాలం అశోక్, మీడియా అధ్యక్షుడు పాయం అజయ్, కార్యదర్శులు తల్లడి ప్రసాద్, కోరం మనోజ్, కంబాలపల్లి హరినాథ్, ఆదివాసీ నాయకుడు తల్లడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు ఆదివాసీ రైతులు దీక్షలు చేపట్టిన తర్వాతే రెవెన్యూ అధికారులు స్పందించి రికార్డులు పరిశీలించడం, పంచనామా నిర్వహించి నివేదిక అందజేయడం చర్చనీయాంశంగా మారింది. ఇకపై ఆదివాసీ రైతులు తమ భూముల కోసం మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా, భూ రికార్డులను పకడ్బందీగా పరిరక్షించి చట్టబద్ధమైన హక్కులను కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# సామాజిక న్యాయ పోరాట రథసారథి చాకలి ఐలమ్మ

***– మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ***



**వైరా, సెప్టెంబర్ 26,( భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం సామాజిక న్యాయం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం, నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని, బడుగు బలహీన వర్గాల గౌరవం, హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యం కోసం వీరనారి ఐలమ్మ ఆశయాల పోరాట స్ఫూర్తిని నేటి తరానికి చేరవేయడం ప్రతి ఒక్కరు బాధ్యత అని, ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలకు ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని, తెలంగాణ ప్రజల హక్కుల కోసం సాగిన పోరాటంలో, ఐలమ్మ పోషించిన పాత్ర మరువలేనిదని ఆమె గుర్తు చేశారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం, సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె ప్రదర్శించిన తెలుగు పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. రామచంద్రరావు, మున్సిపల్ మేనేజర్ సుధీర్, మున్సిపల్ సిబ్బంది. ఏడవ వార్డు కౌన్సిలర్ పనితి సైదులు, చల్లా మెడికల్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, ముల్లపాటి సీతారాములు,ఉండ్ర శ్యాంబాబు , కాంగ్రెస్ పార్టీ నాయకులు పమ్మి అశోక్, తదితరులు చాకలి ఐలమ్మ కు ఘనంగా నివాళులు అర్పించారు.

# అక్రమాల్ని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?

**– మహిళ మొబైల్ ఎందుకు తీసుకున్నట్లు**

**– బిజెపి మహిళా ప్రతినిధులు ఫైర్**




**పాల్వంచ. సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్):**
ఇండ్లు పూర్తి చేయకుండానే డబుల్ బెడ్ రూమ్ డ్రా ఎలా తీస్తారు..?
మతానికి. కులానికి రెండు రిజర్వేషన్ లు ఎలా వర్తిస్తాయి..?
వచ్చేది బి జే పి ప్రభుత్వం
విలేఖర్ల సమావేశం లో బిజెపి నాయకులు ఫైర్

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న షాడో ఎమ్మెల్యే షాబీర్ పాషా వ్యవహారం తార స్థాయికి చేరిందని బిజెపి నాయకులు ఫైర్ అయ్యారు. పాల్వంచ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు... డబుల్ బెడ్ రూమ్ లాటరీలో ముస్లింలకు పెద్దపీట వేశారని 12% రిజర్వేషన్ అంటూ మతం పేరుతో కొన్ని జనరల్ కోటాలో కొన్ని ఇండ్లను ఎక్కువగా ముస్లింలకు కేటాయించడం సరికాదని అడిగినందుకు మా బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పై దౌర్జన్యం చేయటం, దుర్భాషలాడటం సరికాదని ఇదేనా మీ ప్రజాపాలన అని ప్రశ్నించారు...
దాడులు చేయటం మీలా మాకు చేతకాదని అనుకుంటున్నారని మా తడాఖా కూడా న్యాయబద్ధంగా చూపిస్తామని హెచ్చరించారు. ఒక మహిళ కార్యకర్త మొబైల్ ను దౌర్జన్యంగా షాడో ఎమ్మెల్యే కు గుంజుకునే హక్కు, ఆమెను దుర్భాషలతో దూషించే హక్కు మీకు ఎక్కడదని ఇంట్లో కుటుంబీకులకే ఒకరి సెల్లో ఒకరు తీసుకునే హక్కు లేదని ఒక మహిళ మొబైల్ తీసుకొని అందులో వీడియో డిలీట్ చేశారు... మహిళలపై దౌర్జన్యంగా, అసభ్యంగా ప్రవర్తించిన దోషులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని. కేసు ఫైల్ చేయాలని లేని పక్షంలో ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధం అన్నారు. న్యాయం జరగకపోతే డీజీపీ స్థాయి అధికారుల వద్దకి మరియు జాతీయ మహిళా కమిషన్ ని కూడా కలుస్తామని ఈ సందర్భంగా చెప్పారు. ఇప్పటికే పాల్వంచ పోలీస్ స్టేషన్లో కేసు పెట్టడం జరిగింది అన్నారు.. సిపిఐ నాయకులు పేదవారికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉన్న సరే అతని వెంట ప్రతిసారి షాడో ఎమ్మెల్యే కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతవరకు సమంజసం అని అన్నారు.. వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని మా ప్రభుత్వం లో
పేదలకు న్యాయం చేస్తామని అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని అన్నారు. గతంలో కూడా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఇల్లు నిర్మించకుండానే లాటరీ పద్ధతిలో డ్రా తీశారని. ఆరోజు బీఆర్ఎస్ ప్రభుత్వం తెల్ల స్లిప్పు మీద ఒక నెంబరు వేసి ఇచ్చారు తప్ప లబ్ధిదారులకి ఏ ఒక్కరికి కూడా ఇంతవరకు ఇల్లు కేటాయించలేదని. గత ప్రభుత్వంలో కేటాయించిన లబ్ధిదారుల పేర్లు అధికారికంగా బయటపెట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గతంలో డబల్ బెడ్ రూమ్ వచ్చిన వారి పేర్లు కొందరివి ఆన్లైన్ లో లేకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు మీరు కూడా ఇప్పుడు అదే పాట పాడుతున్నారని ఇల్లు నిర్మాణం కాకుండా డ్రా ఎలా తీస్తారని ఈ సందర్భంగా ప్రశ్నించారు...
ఈ కార్యక్రమంలో పాల్వంచ నాలుగోవ డివిజన్ బిజెపి కార్పొరేటర్, జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్యలక్ష్మి, బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, బిజెపి యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు జుజ్జూరు మోహనకృష్ణ, బిజెపి జిల్లా ఆఫీస్ సెక్రటరీ దురిశెట్టి కుమార్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యురాలు పద్మ, బిజెపి మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ముష్వ అపర్ణ, చుంచుపల్లి మండల అధ్యక్షుడు బలగం శ్రీధర్, బిజెపి మహిళా మోర్చా సెక్రెటరీ భూక్య ఆశ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్) :** చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అంకిత్ వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, చాకలి ఐలమ్మ ధైర్యసహాసాలను గుర్తుచేసుకున్నారు. ఈ యొక్క కార్యక్రమానికి జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, కొత్తగూడెం రజక సంఘం నాయకులు నేరెళ్ల రమేష్. టౌన్ ప్రెసిడెంట్ సుంకర అజిత్. టౌన్ సెక్రెటరీ భూస రాజు. ముఖ్య నాయకులు శంకర్. మంచిల్ల శ్రీను, కొండల్. అంజయ్య. మల్లయ్య. పోసి. చింతల్ రాజు పాల్గొన్నారు. అలాగే కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద రాష్ట్ర సిపిఐ కార్యదర్శి సబీర్ పాషా ముఖ్యఅతిథిగా పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మ చిత్రమటానికి పూలమాల వేసి నమసుమంజలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల రమేష్. సుంక రజిత. భూస రాజు. శంకర్. చింతల్ రాజు. అంజయ్య. బాబురావు పాల్గొన్నారు..

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

**- సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్.వెంకటరమణ**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్) :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్.వెంకటరమణ అన్నారు. చాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకుని శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... సామాజిక వివక్ష, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ తెలంగాణ మహిళా శక్తికి ప్రతీకగా నిలిచారని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను నేటి తరానికి తెలియజేస్తూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎం. గోవిందరావు, డీజీఎం సివిల్ రాజేంద్రకుమార్, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఏఐటీయూసీ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ జక్కుల గట్టయ్య, ఐఎన్‌టీయూసీ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ రజాక్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాల విజయవంతానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు

**– ఉత్సవ కమిటీ అధ్యక్షులు యెర్రా కామేష్**

**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్) :** పదకొండు రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకుని, నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది యెర్రా కామేష్ అన్నారు. శనివారం స్థానిక భజనమందిర్ సమీపం లోని వివేకానంద స్కూల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కుల, మతాలకు అతీతంగా జరుగుతున్న ఈ పండుగను, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ చిన్నా, పెద్దా తేడా లేకుండా గణనాధునికి ఘనంగా వీడ్కోలు పలికారని, పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అద్భుతంగా విధులు నిర్వహించారని, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ ప్రతీ ప్రభుత్వ శాఖ సహకరించడం వల్ల ఈ వేడుకలు ఇంత ఘనంగా నిర్వహించామని పేర్కొన్నారు. యువత కూడా చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మాలలు ధరించి ఆధ్యాత్మిక వాతావరణంలో పండుగను జరుపుకోవడం శుభసూచకమని అభినందించారు.. గత 37 సంవత్సరాలుగా పట్టణంలో గణేష్ విగ్రహాలకు వీడ్కోలు పలుకుతూ సూపర్ బజార్ వద్ద ఏర్పాటు చేస్తున్న వేదిక మరోసారి తన ఆనవాయితీ కొనసాగిస్తూ అద్భుతంగా నిర్వహించడం సంతోషాన్ని కలిగించిందనీ వచ్చే ఏడాది కూడా మరింత శోభాయమానంగా నిర్వహించేందుకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఆంధ్రప్రభ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దారా రమేష్, కోశాధికారి వందనపు శ్రీధర్, కుడిక్యాల సమ్మయ్య, మెరుగు చింటేశ్వర్, నాగుల రవికుమార్, కూసనా సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్తగూడెం జడ్పీ కార్యాలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్) :** చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని జిల్లా ప్రజా పరిషత్, భద్రాద్రి కొత్తగూడెం కార్యాలయంలో శనివారం చాకలి ఐలమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.అప్పారావు మాట్లాడుతూ... సామాజిక న్యాయం, సమానత్వం కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ధైర్యసాహసాలు, ప్రజా హక్కుల కోసం చేసిన ఉద్యమం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్ఎంఈఏ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజేష్, సూపరింటెండెంట్లు వి.బి.వి.కె.ప్రసాద్, బి.రమేష్, ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రజా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

# జీవో 76 ప్రకారం రామవరానికి పట్టాలు ఇవ్వాలి

**– ఏఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె ఫహీమ్ దాదా**

**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్) :** సింగరేణి ప్రాంతమైన రామవరం ప్రజల సొంత ఇంటి చిరకాల కోరిక జీవో 76 ప్రకారం సింగరేణి ప్రాంతంలో స్థలాలకు పట్టాలు ఇచ్చి తీర్చాలని ఏఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె ఫహీమ్ దాదా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రామవరంలో ఏర్పాటు చేసిన ఏఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎస్.కె ఫహీమ్ మాట్లాడుతూ.. దశబ్దాలుగా రామవరం ప్రజలు సొంతింటి కల సమస్య పరిష్కరించాలని, అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సింగరేణి ప్రాంతాలైన పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల, భద్రాద్రికొత్తగూడెం స్థలాలకి జీవో 76 ప్రకారం పట్టాలు ఇస్తామని తెలపడం జరిగిందని, అందులో రామవరాన్ని పొందుపరిచి దశబ్దాల ప్రజల సమస్య పరిష్కరించాలని అయన కోరారు, 2004 కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు లు కట్టుకునే అవకాశం కల్పించారని, అదే తరహాలో మరొకసారి రామవరం పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు లు కట్టుకునే అవకాశం ఇవ్వాలని, అదేవిదంగా ఇల్లులకు పట్టాలు ఇవ్వాలని,సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే అవకాశం జీవో 76 ద్వారా కలిపించాలని అయన కోరారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె.ఖయ్యూమ్, ఉపాధ్యక్షులు భూపేష్, జావీద్, రసూల్, కమల్, కొయ్యడ రవి, బాబా, రామకృష్ణ, విజయ్ కాంత్, దాసరి శివ, శ్రీకాంత్, బన్ను, చిన్ను పాల్గొన్నారు.



## రిజర్వ్ ఎస్ఐ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**– చిన్న వయస్సులోనే మృతి చెందడం బాధాకరం.. ప్రభుత్వపరంగా అండగా ఉంటాం**




**కారేపల్లి, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్ రాములు):** నిజామాబాద్ హెడ్‌క్వార్టర్స్‌లో రిజర్వ్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు తుపాకీ పేలి మృతి చెందిన హన్మకొండ సతీష్ కుటుంబాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శనివారం పరామర్శించారు. సతీష్ స్వగ్రామమైన శాంతినగర్‌కు వెళ్లిన ఎమ్మెల్యే.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తుపాకీని శుభ్రం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రివాల్వర్ పేలి సతీష్ ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే కుటుంబానికి దూరం కావడం విషాదకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా నిలిచి, అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి ఎస్ఐ బైరు గోపి, సింగరేణి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, కోట మైసమ్మ దేవస్థాన ధర్మకర్త పర్స పట్టాభిరామారావు, భాగ్యనగర్ సర్పంచ్ బానోత్ హీరాలాల్, గుగులోత్ భీముడు, పెద్దబోయిన ఉమాశంకర్, దారావత్ వినోద్, అడపా పుల్లారావు, కడియాల సుధాకర్, మాలోత్ భావసింగ్, సుడిగాలి బిక్షమయ్య, శాగంటి వెంకటేశ్వర్లు, మహమ్మద్ హనీఫ్, బండారు మోహన్‌రావు చిన్న తదితరులు పాల్గొన్నారు.

## బీసీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు.. దరఖాస్తుకు మరో 4 రోజులే



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్) :** తెలంగాణలోని బీసీ మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక కార్యక్రమాన్ని చేపట్టింది. 'ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకం ద్వారా అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందించనుంది. ఈ పథకం కింద 100 శాతం సబ్సిడీతో కుట్టుమిషన్లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఈ పథకం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. అర్హత ఉన్న మహిళలు ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 30, 2026లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తు గడువు ముగియడానికి ప్రస్తుతం మరో నాలుగు రోజులు మాత్రమే ఉండటంతో అర్హులైన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళల కుటుంబ వార్షిక ఆదాయం: గ్రామీణ ప్రాంతాల్లో: రూ.1.50 లక్షల వరకు, పట్టణ ప్రాంతాల్లో: రూ.2 లక్షల వరకు ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పథకం అమలులో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ముఖ్యంగా పేద మహిళలు, నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలకు ప్రాధాన్యం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. కుట్టుమిషన్ల ద్వారా మహిళలు ఇంటి నుంచే స్వయం ఉపాధి పొందుతూ ఆదాయం సంపాదించేందుకు అవకాశం కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. అర్హత ఉన్న బీసీ మహిళలు దరఖాస్తు గడువు ముగిసేలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం మంచిది.

## కొత్తగూడెం 3టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాల ఘర్షణ - కేసు నమోదు




భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్) : కుటుంబ వివాదం నేపథ్యంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్న ఘటన కొత్తగూడెం 3టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. కుటుంబ సమస్యపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇరువర్గాలు పరస్పరం దూషించుకోవడంతో పాటు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించిన పోలీసు సిబ్బందిని సైతం నెట్టివేసి, విధులకు ఆటంకం కలిగించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. సంబంధిత నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. కుటుంబ వివాదాలను చట్టపరమైన మార్గంలో పరిష్కరించుకోవాలని, పోలీస్‌స్టేషన్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# నాటు పడవల్లో పరిమితికి మించి ప్రయాణం.. పొంచి ఉన్న ప్రమాదం!

**- ప్రతికూల వాతావరణంలోనూ యథేచ్ఛగా రాకపోకలు.. ప్రయాణికుల భద్రతపై ఆందోళన.. పట్టించుకోని అధికారులు?**

**వాజేడు సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్):** ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్న వేళ నాటు పడవల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షాలు, వరదల ప్రభావంతో నదులు, వాగుల్లో నీటి ప్రవాహం పెరిగిన సమయంలోనూ ప్రయాణికుల భద్రతను పట్టించుకోకుండా పడవల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో నదులు, వాగుల్లో ప్రవాహ ఉద్ధృతి పెరిగే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో నాటు పడవల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలించడం ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పడవల్లో ప్రయాణించే వారికి సరైన భద్రతా పరికరాలు, లైఫ్‌జాకెట్లు అందుబాటులో ఉన్నాయా? పడవల సామర్థ్యానికి అనుగుణంగానే ప్రయాణికులను ఎక్కిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**,వాతావరణం అనుకూలంగా లేకున్నా..**

వర్షాల కారణంగా ప్రయాణికులకు ఇబ్బందికరమైన వాతావరణం నెలకొన్నప్పటికీ రాకపోకలు కొనసాగుతున్నాయి. నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగినా, పడవ అదుపుతప్పినా పరిస్థితి తీవ్రంగా మారే ప్రమాదం ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు పడవల్లో ప్రయాణించే సమయంలో మరింత అప్రమత్తత అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

పడవల నిర్వహణ, ప్రయాణికుల సంఖ్య, భద్రతా ప్రమాణాలపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకుని ప్రయాణికుల



ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నాటు పడవలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడకుండా అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

# టోనీ చొరవతో డ్రైనేజీకి మోక్షం

***- రూ.3 లక్షల ఎంపీ నిధులతో సైడ్ డ్రైనేజీ కాలువ నిర్మాణం***



**కారేపల్లి, సెప్టెంబర్ 27 (భద్రాద్రి న్యూస్ రాములు):** సింగరేణి మండల కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు స్థానిక సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) చొరవ తీసుకున్నారు. ఎంపీ నిధుల నుంచి మంజూరైన రూ.3 లక్షలతో నిర్మించిన సైడ్ డ్రైనేజీ కాలువను శనివారం సర్పంచ్ టోనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సైడ్ డ్రైనేజీ కాలువ నిర్మాణంతో వర్షపు నీరు, మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు మార్గం ఏర్పడుతుందని, దీంతో స్థానికులకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని టోనీ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, పీఎస్ఆర్ అనుచరులు ఇమ్మడి తిరుపతిరావు, యాకూబ్, పెద్దమ్మ భాగ్యలక్ష్మి, తాజుద్దీన్, తొగర శ్రీను, విజయ్, అదేర్ల అంజయ్య, కాంట్రాక్టర్ గుగులోత్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విప్లవ విద్యార్థి ఉద్యమ రథసారథి ఏఐఎస్ఎఫ్

**- స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవాగ్ని రగిలించిన నిప్పుకణం**
**- ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ ముగింపు గోడపత్రిక ఆవిష్కరణ**




**కారేపల్లి, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్ రాములు):** స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవాగ్ని రగిలించిన నిప్పుకణం ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నంశెట్టి ఆకాష్ అన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జరిగిన తొలి, మలి దశ ఉద్యమాల్లోనూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల తరఫున వీరోచిత పోరాటాలు నిర్వహించిందని పేర్కొన్నారు. కారేపల్లిలోని గిరి ప్రసాద్ భవన్‌లో శనివారం ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకాష్ మాట్లాడుతూ.. ఈ నెల 28, 29, 30 తేదీల్లో హనుమకొండలో ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న తొలి విద్యార్థి సంఘంగా ఏఐఎస్ఎఫ్‌కు ఘనమైన చరిత్ర ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో పాటు తెలంగాణ ఉద్యమ వారసత్వాన్ని పునికిపుచ్చుకొని విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెకాలే విద్యా విధానానికి వ్యతిరేకంగా, విద్యారంగ సంస్కరణల కోసం, కొఠారి కమిషన్ సిఫారసుల అమలు కోసం ఏఐఎస్ఎఫ్ ఉద్యమాలు నిర్వహించిందన్నారు. 'చదువుతూ పోరాడు.. చదువు కోసం పోరాడు' అనే నినాదంతో విద్యారంగ పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల పెంపు, మహిళలపై దాడులు, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా కూడా పోరాటాలు నిర్వహించిందన్నారు. విద్యాసంస్థల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా విద్యార్థులను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఏఐఎస్ఎఫ్‌కు ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని, తెలంగాణ ఉద్యమ వారసత్వాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ఏఐఎస్ఎఫ్ ఉద్యమం ద్వారా అనేక మంది నాయకులు, మేధావులు ప్రజాజీవితంలోకి వచ్చినట్లు ఆకాష్ పేర్కొన్నారు. 90వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థుల్లో ఉద్యమ స్ఫూర్తిని మరింత పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# మాదారం గ్రామపంచాయతీలో చేయూత పింఛన్ల వెరిఫికేషన్

**- అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు**
**- ఇంటి వద్దకే అధికారులు.. సర్పంచ్ అజ్మీర ఉమారాణి**



**కారేపల్లి, సెప్టెంబర్ 27 (భద్రాద్రి న్యూస్ రాములు):**
మాదారం గ్రామపంచాయతీ పరిధిలో చేయూత పింఛన్ల లబ్ధిదారుల వెరిఫికేషన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సర్పంచ్ అజ్మీర ఉమారాణి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఏఈ రాజశేఖర్ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అజ్మీర ఉమారాణి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. పింఛన్ కోసం ఎవరూ దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. లబ్ధిదారులు తమ సమస్యలను నేరుగా గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లేదా పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి పారదర్శకంగా అందేలా గ్రామపంచాయతీ స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, అజ్మీర బాలాజీ, వి. భారతి, వీరన్న, కాసాని లక్ష్మీనారాయణ, కోయాల శీను, బట్టు నరసయ్య, బట్టు సంగయ్య, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించాలి

**- సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణలో అధికారుల దిశానిర్దేశం**
**- పెండింగ్ బిల్లులు, సర్పంచుల వేతనాలు విడుదల చేయాలని రంజిత్‌కుమార్ విజ్ఞప్తి**

**ఖమ్మం, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్ రాములు):** వికసిత్ భారత్--పంచాయతీ ప్లాన్, వి.బి.జి. రాంజీ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా భక్త రామదాసు కళాక్షేత్రంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు అక్టోబర్ నుంచి జూన్ వరకు నిరంతరం పని కల్పించేలా అవసరమైన పనులను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో పంచాయతీ ప్రణాళిక రూపొందించాలని అధికారులు సూచించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను ప్రజల నుంచి గుర్తించేందుకు ఈ నెల 27, 28, 29 తేదీల్లో గ్రామసభలు నిర్వహించాలని అధికారులు తెలిపారు. గ్రామసభల్లో ప్రజల నుంచి పనులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి, వాటిని ఎంపీడీవో ద్వారా ఆమోదింపజేసుకొని ఉపాధి హామీ కూలీలకు జీవనోపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచులు, కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ విద్యాలత, డీపీఓ, డీఆర్‌డీఓ, డీఎల్‌పీఓలు, మాస్టర్ ట్రైనర్లు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ ప్రణాళిక రూపకల్పన, ఉపాధి హామీ పనుల గుర్తింపు తదితర అంశాలపై వివరించారు.




**సర్పంచుల సమస్యలను పరిష్కరించాలి**

సింగరేణి మండలం గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్‌కుమార్ సర్పంచుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల సర్పంచుల గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేయాలని పంచాయతీరాజ్ అధికారులను కోరారు. అలాగే గ్రామాల్లో సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరితగతిన విడుదల చేసి గ్రామపంచాయతీల అభివృద్ధికి సర్పంచులను ప్రోత్సహించాలని కోరారు. కొత్తగా గుర్తించే పనులను ఉపాధి హామీ కూలీల ద్వారా చేపట్టి వారికి నిరంతర ఉపాధి కల్పించేలా పనులకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెటీరియల్ పేమెంట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు తదితర పనులకు సంబంధించిన ఎంబీలు పూర్తయినప్పటికీ పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరగా విడుదల చేయాలని సర్పంచుల తరఫున అధికారులను కోరారు. జిల్లాలోని వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిశీలించి త్వరలో పరిష్కార మార్గాలు చూపిస్తామని డీపీఓ, పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ విద్యాలత హామీ ఇచ్చారు. జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు నరహరి బాబు ఆధ్వర్యంలో కూడా జిల్లాలోని సర్పంచులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డిప్యూటీ కమిషనర్ విద్యాలత దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను సానుకూలంగా విన్న ఆమె.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రామ్ తల్లూరి జన్మదినం: ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ





**కోదాడ, సెప్టెంబర్ 27 (భద్రాద్రి న్యూస్):** జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తల్లూరి జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం కోదాడ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. రామ్ తల్లూరి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషితో జనసేన మరింత ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పసుపులేటి రామారావు, మోలుగురి సైదులు, నీలం రాజేష్, రాయల సతీష్, పి.మహేష్ చంద్రా, షేక్ సత్తార్, సాధినేని వెంకన్న, జల్లా జనార్ధన్, వెంకట చారి, పలువురు జనసైనికులు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కుక్కడపు వెంకటేశ్వర్లు మృతి బాధాకరం

**- మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్**

**కోదాడ, సెప్టెంబర్ 27(భద్రాద్రి న్యూస్):** కోదాడ పట్టణ పరిధిలోని 26వ వార్డు బీఆర్ఎస్ నాయకుడు కుక్కడపు వెంకటేశ్వర్లు ఇటీవల మరణించగా, బీఆర్ఎస్ కోదాడ టౌన్ పార్టీ ఆధ్వర్యంలో వారి నివాసం వద్ద ఆయనకు సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కోదాడ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ హాజరై, వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ గారు మాట్లాడుతూ కుక్కడపు వెంకటేశ్వర్లు గారి వ్యక్తిత్వాన్ని, పార్టీకి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కుక్కడపు వెంకటేశ్వర్లు కల్మషం లేని మనిషి అని, ఎవరిపైనా ద్వేషం కానీ, అసూయ కానీ లేని వ్యక్తి అని ఆయన కొనియాడారు. ఆయన ఎల్లప్పుడూ సమాజ హితాన్ని కోరుకునే వారని, మంచి పని కోసం ఎన్నడూ వెనకడుగు వేయకుండా పోరాడే వారని గుర్తు చేసుకున్నారు. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో పోటీ చేయడానికి అభ్యర్థులు లేని క్లిష్ట పరిస్థితిలో, వెంకటేశ్వర్లు గారికి ఉన్న మంచి పేరును బట్టి పార్టీ తరఫున ఆయనను కోరడం జరిగిందని తెలిపారు. గెలుపోటములు దైవాధీనమని, పార్టీ విజయం కోసం తాను తప్పకుండా కృషి చేస్తానని ఆయన ఆనాడు ముందుకు వచ్చారని ప్రశంసించారు. ఎన్నికల సమయంలో కొందరు భయభ్రాంతులకు గురిచేసినప్పటికీ ఆయన భయపడలేదని, తాను విప్లవాల గడ్డ మీద పుట్టానని, తనను ఎవరూ బెదిరించలేరని ధైర్యంగా నిలబడ్డారని మల్లయ్య యాదవ్ గుర్తు చేశారు. గతంలో లైబ్రేరియన్‌గా, కేఆర్ఆర్ కళాశాలలో, పబ్లిక్ క్లబ్‌లో ఆయన సేవలు అందించారని, ప్రతి చోటా ఒక స్నేహశీలిగా, సౌమ్యుడిగా, వివాద రహితుడిగా మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ఆయన కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# ఎమ్మెల్సీ ఎన్నికలపై కేటీఆర్ కీలక సమీక్ష

**- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**



**కోదాడ, సెప్టెంబర్ 27(భద్రాద్రి న్యూస్):** రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కీలక సమావేశం నిర్వహించింది. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) నేతృత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పార్టీ ముఖ్య నాయకులతో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు.ఈ ముఖ్యమైన సమావేశంలో కోదాడ మాజీ శాసనసభ్యుడు బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని, ఎన్నికల వ్యూహాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం కోసం క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడంపై ఈ సమావేశంలో కేటీఆర్ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

# అమెరికా పర్యటన ముగించుకుని స్వగ్రామానికి మంజుల దంపతులు

**- శాలువాతో ఘనంగా సన్మానించిన సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు**

**కారేపల్లి, సెప్టెంబర్ 26 (భద్రాద్రి న్యూస్ రాములు):** రెండు నెలల అమెరికా పర్యటనను ముగించుకుని సీనియర్ రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల, ఆమె భర్త మోహనకృష్ణ స్వగ్రామానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా వారిని సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్‌కుమార్, సొసైటీ డైరెక్టర్ అడ్డగూడ ఐలయ్య, సూర్యతండా సర్పంచ్ బానోత్ రాందాస్ నాయక్, గిద్దవారిగూడెం సర్పంచ్ వెంకటేశ్వర్లు, రావోజీతండా సర్పంచ్ భూక్య బాలు, అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్ తదితరులు మంజుల, మోహనకృష్ణలను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినోద్, షేరు, రవి తదితరులతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని మంజుల, మోహనకృష్ణలకు శుభాకాంక్షలు తెలిపారు.



Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem - 507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046